

కవిత్వం

# తెల్లకాగితం

# మహత్తర జీవిత కాంక్ష

పుస్తకాలు మీ జీవితాన్ని సుఖమయం చేస్తాయి. భావాల ఉద్రేకాల, సంఘటనల, భయంకర గందరగోళంలో నుంచి బయటపడేందుకు అవి మీకు స్నేహపూరితమైన ఆలంబన ఇస్తాయి. మిమ్మల్ని మీరు గౌరవించుకోవడం, పరులను గౌరవించడం నేర్పుతాయి. హృదయాన్ని, మేధను; మనిషిపట్ల, ప్రపంచం పట్ల ప్రేమతో నింపివేస్తాయి. మనుషుల్లో మీరు చూడని దాన్ని, ఎదుటివాడు చెప్పడానికి ఇష్టపడనిదాన్ని పుస్తకాలు మీకు చెబుతాయి. సాంఘిక, ఆర్థిక, రాజకీయ, స్వాభావిక, ప్రాకృతిక తదితర కారణాల చేత మనిషి సతతం నిక్షిప్తం చేసుకున్న వైరుధ్యాలను బహిర్గతం చేస్తాయి. ఎందుచేతనైనా గానీ, వారు పోషించే అల్పత్వాలను పరిహసిస్తాయి. అలాగే సర్వశ్రేష్ఠతనూ ప్రస్తుతిస్తాయి.

మానవుడి సర్వకాల సర్వావస్థలనూ చిత్రణ చేసినవి పుస్తకాలే. సారంలో ప్రపంచ మానవులందరి బాధలూ ఒక్కటే. మనిషిపై ఆధిపత్య శక్తులు చేసే దోపిడీని, చూపే వివక్షనూ మానవ ప్రేమికులు అన్నికాలాల్లోనూ అడ్డుకుంటూనే ఉన్నారు.

వారి గురించి తెలుసుకోవడమంటే మానవుడి శ్రేష్ఠమైన గౌరవం గురించి తెలుసుకోవడమే. ఒక మనిషితో ఏళ్ల తరబడి సాహచర్యం చేసినా అతడి లేదా ఆమె గురించి పాక్షికంగా మాత్రమే తెలుసుకోగలరు. అదే సమగ్రంగా చిత్రించిన ఒక మంచిపుస్తకం ... మనిషి జీవితాన్ని అన్ని కోణాల్లో మీకు చెబుతుంది. పుస్తకాలను చదవడమంటే జీవితాన్ని చదవడమే. చరిత్రను చదవడం, సంస్కృతిని అర్థంచేసుకోవడమే.

మహాభారత, రామాయణ గ్రంథాలు, గాథలు భారత సంస్కృతి పై చూపుతున్న ప్రభావం విస్మరించరానిది. వేల ఏళ్లుగా గడచి వస్తున్న చరిత్రనూ, సంస్కృతిని మీరు అర్థం చేసుకోవాలంటే పుస్తకాలకు మించిన సాధనాలు లేవు.

మరో మాట.. వాస్తవ జీవితాన్ని మాత్రమే తెలియజేసి అంతటితో తనపని అయిపోయిందని ఊరుకోదు సాహిత్యం. జీవితం ఇప్పుడున్న స్థితికంటే ఒక డుగు ముందుకెయ్యాలంటే ఏం చెయ్యాలో కూడా సూచిస్తుంది. కనీసం ఆరకమైన ఆలోచననైనా మీలో రేకెత్తిస్తుంది. అడుగడుగునా జీవితం పై విరక్తి పుట్టడానికి గల కారణాలను విశ్లేషిస్తూనే.. వైరాగ్యాన్ని పోగొట్టి జీవితాన్ని సుఖమయం చేసుకోగలమన్న ఆశను, తపనను కలిగిస్తుంది.

మహత్తర జీవిత కాంక్షను కలిగించేది సాహిత్యం ఒక్కటే.. **"ది ఫౌండేషన్ ఆఫ్ తెలుగు లిటరేచర్"**

ఇదీ ఉఒ నా.. ౧౨౩౪ ...


అ తెల్లకాగితం | ఆ కవిత్వం నా కళ్లజోడు | ఇ ఓ కల జారిపోయింది.. | ఈ ఆమె నా.. | ఉ పేపరుతో నాన్న.. | ఊ చావు వార్త చదవాలని లేదు

ఋ నువ్వే.. నాగురువంటే.. | ౠ సాగిపో.. | ఌ బొమ్మరాళ్ళు | ౡ నేస్తం... | ఎ చిన్నినాన్నా! | ఏ ఏదో కారణం.. | ఐ కవిని చూశాకా..

ఒ నిను చేరాలనే.. | ఓ నిను చేరాలంతే.. | ఔ చార్మినార్ చెంపన.. | అం మాటొకటి చెప్పిపోనీ.. | అః తుహినం తుడు

క అలాగే.. అలాగే...... | ఖ అందమా!! నువ్వెవరు?.. | గ No worries!!! | ఘ ఇంకేం కావాలి! | ఙ ఇదేం న్యాయం దేవుడా?..

చ ఉప్పధనం | ఛ పదాల తోట దడి | ౘ భయ్యా! Diversity ఎక్కడ! | జ గుల్ మకాయీ! | ౙ ఇదికదా జీవితం.. | ఝ రాయడం అసంకల్పితం | ఞ ఏదో కాంతి నాలో..

ట ఒక దీపావళి వేళ... | ఠ నాణెం గాల్లోకి ఎగురుతుంది | డ హాయి చెయ్యి | ఢ ఆధునిక స్వేచ్ఛ | ణ విషాదానికి ఓదార్పు

త భావోద్వేగం.. | థ నివేదన | ద వరదై పారుతా.. | ధ ఓ రైలు ప్రయాణం.. | న చతుర్థచంద్రోదయం

ప మంచి బహుమతి | ఫ వెలుగు  చూద్దాం | బ కొన్ని tellగు మాటలు | భ నాతో.. ఆడవా!! | మ మేలుతలపు

య ప్రేమకు మచ్చ నీ ఊసు | ర ఉడతా!!నీకూ నాకూ తేడా.. | ఱ పిచ్చుకా! ఓ పిచ్చుకా!! | ల నల్కిస్ నల్కిస్ ..! | ళ ఓ సరదా దండకం.. సీరియస్ గా..

వ కొన్ని మెరుస్తుంటాయ్.. | శ ఈ క్షణం ఇలా ఆగి పోనీ.. | ష నాకే గనక చేతనైతే..

స అక్షరాన్ని నేనక్షరాన్ని.... . | హ అడ్డాలబ్బాయ్! నీతో కలసిఉన్నప్పుడు.. | క్ష చివరిపేజీ.

# తెల్లకాగితం

మనిషన్నాకా  ఏవో కొన్ని అక్షరాలు
తనవై ఉంటాయి
పేరో.. ఊరో.. తనవారో..కానివారో  అక్షరాలే..
పలుకుతాయ్,  పలకరిస్తాయ్,
పలవరిస్తాయ్, పులకరిస్తాయ్
పగలబడీ నవ్వుతాయ్
అలవాటైన కొద్దీ ప్రతీదీ నాతో చేరిపోతుంది
నాకు ప్రతీకగా మారిపోతుంది.
నాకు నచ్చని 'నా'ని పుచ్చుకుని నడవలేను
పచ్చ పొడిపించుకుని తిరగలేను
పలికిన ప్రతీమాటా నాది మాత్రమే ఐనప్పుడు
నీ మాట నోటరాక.. నేను రాయైపోతాను
నాకు నేనే పరాయై పోతాను
నాది నీదైనప్పుడే నిజంగా నేను మనిషినౌతాను

'నా'ని వదిలించుకోవాలనో… నన్ను నీలో నిలుపుకోవాలనో
నావైనవన్నీ నీకు పంచేస్తున్నా
నా మెడలు వంచి నీవి చేసి నీకు ఇచ్చేస్తున్నా
నాది నీదైనప్పుడు నేను నీవైనట్లే
అందుకో  నన్ను..  నీ ప్రపంచంలోకి కవిత్వమై వస్తున్నా
నీ సాక్షిగా నన్ను నేను పోగొట్టుకోవాలి
నా పేరూ ఊరూ చెరిపేసుకోవాలి
అక్షరాలను ఆవహించుకున్న నన్ను చదివించుకుని
మనసును తెల్లకాగితం చేసుకోవాలి
నేనే నీ సొంతమైనప్పుడు మనమధ్య
అక్షరాలు అనుభూతుల్ని మాత్రమే మిగల్చాలి
అక్షరాలు మనలోనికి  కరిగి  స్వచ్ఛమైన తెల్లకాగితం  మిగలాలి
కవిత్వం మన అంతరాంతరాళాల్లోకి ఇంకి..
లోకమంతా తెల్లకాగితమవ్వాలి
(కొప్పర్తి మాస్టారూ!!.. మీ బాటన...)

# కవిత్వం నా కళ్ళజోడు

అది నా చెంత లేకపోతే అంతా మసక మసక
నింగి..నీరు నీలాలు కలసే చోటున సౌందర్యం బదులు
నెత్తుటి చుక్కలచారల..బీభత్సం
నా ముందున్న మనిషి వెంటాడే నీడై..
నను  అభద్రతా భావనలోకి నెట్టుతాడు
అలికిన అక్షరాలు రెటీనా నంటినట్టు నాకంటికి
నలకలై నకలై ఎంత నలిపినా అడ్డంగానే కనిపిస్తాడు
ఎదుటి వారంతా సాటివారు-తోటివారులా కాక
బోటిముద్దల్లా అగుపిస్తారు
ఒక నవ్వే నవ్వితే అదే తిరిగి అందేదేమో..
నొసలు  ముడుచుకుని పెదాలు సాగదీస్తే.. ఈ వ్యక్తీకరణ
సభామర్యాదకు ఆమడ దూరమని
నాభావంతో ఇమడక అంతదూరమూ జారిపోతారు..

వారు మరుగయ్యాకా..  నా ముందు ఓ జారుడు పదార్థమున్నట్టూ
అది వారిని వెనక్కి తేలేని బర్ముడా త్రికోణంలో కూరేసినట్టూ..
 అనుకుని అడుగైనా కదపకుండా
ప్రశ్నార్థకం నవ్వుతో నిలబడి  ఉంటాను
ఎవరైనా ఏదైనా చూపిస్తే అది కళ్ళ డాక్టరు పరీక్షకోసం గలిబిలి
చేసిన అక్షరాలేమోనని ప్రహేళికను నింపే పిల్లాడిలా
లోగుట్టును రట్టు చేద్దామని విఫలయత్నం చేస్తాను
ఎట్లా చూసినా నా కంటికి కలకే ..
పుసుగు పట్టిన కళ్ళతో చూసే వాడికి లోకం అంతా కంటకింపే
మారిన మార్పుని ఆకళించుకోలేని మనిషిని కదా!
అన్నీ తెలుసనుకుని ఏమీ తెలియకుండా ఉండలేక
అప్పుడప్పుడు కవిత్వం కళ్ళజోడుతో లోకాన్ని చూస్తాను..
ఇప్పుడంతా.. నాకు తెల్లకాగితం..  కింద మాత్రం నా సంతకం.

## ఓ కల జారిపోయింది

ఆకాశం కాన్వాస్ పై
కాలం కుంచె నేల ముంచి జార్చిన చుక్కలా
సుమనోభిరామంగా ఎదిగిన పచ్చదనాల చెట్టుండేది
అది ఓ రాత్రి వేళ కలల్లోంచి జారిపోయింది.

గుండె పగిలిన చప్పుళ్ళు తోటంతా..
పూలూ  పళ్లూ చివుర్లూ చెట్టు నాశ్రయించిన పక్షులూ
మొదలు కుదేలైన వేళ్లూ బొట్టు–బొట్టూ రాల్చాయి.

తరలి వచ్చిన గూటి పక్షుల బిక్క చూపులు
నేల వాలి తోట గుండెను చూసేటి తోటి మొక్కలు
తవ్వి తీసినట్టు ఉబికి వచ్చే కన్నీటి చుక్కలు

ఇప్పుడిక కిలకిలలు లేవు మౌన రోదనలు తప్ప
అకాల వానకి కొమ్మారెమ్మా విలవిల లాడాయి.
పట్టపగలు చీకట్లు పరచుకున్నాయి..
ఆకాశం చెమ్మగిల్లింది

నింగిని నేలను కుదిపే ఓ పిడుగుపాటు
ఎప్పుడు రాలిందో ఉల్క చెట్టుని ఎందుకు తాకిందో
బెరడు లాంటి నిబ్బరంతో కాలం ఎలా ఓర్చిందో
నిలబడ్డ నేల నుండి నింగివైపు చూస్తూ
నీడనిచ్చి తోడునిచ్చే పచ్చదనం ఒకనాటి వేడుక
ఇప్పుడది మిగిలింది కన్నీటి జాడగా
జీవితాన్ని కదిలే బొమ్మల్లా అందించే కథ ముగిసింది
వెలుగునీడల తోడుగా ఆడే ఆట కలలా చెదిరింది
అంటుకట్టిన తెలుగు పాట పల్లవంతో ఆగింది
ఆ చెట్టే ఓ చిత్తరువై జ్ఞాపకం
గా మిగిలాక
ప్రతి మొక్కా చెట్టై ఎదగటమే
ఆశయాల అంచులు దాటే పచ్చదనాన్ని
తెలుగు తోటలో పెంపొందించడమే
ఆకాశం ఆశించే హృద్యమైన నివాళి

(ఈటీవి ఎమ్.డి.  సుమన్ గారి స్మృతిలో..)

# ఆమె నా..

నే పుట్టినప్పుడే.. ఆమెకు పాతికేళ్ళు వచ్చాయి
మేము మేమే కానీ మేమిరువురమూ ఒక్కరమే
నా ఏడుపు ఘోష వేరు.. ఆమె లాలించే భాష వేరు
నేను నేర్చిందేం లేకున్నా.. నేర్పిస్తూ అలవలేదు ఆమెన్నడూ
నేను ఏడ్చినా, పక్క తడిపినా మాయమయ్యేవి ఆ రూపాలు
అవి నా చుట్టూ నించొన్న బుగ్గల్లాగే భూతాలు
పరిగెత్తుకొచ్చి.. పొదివిపట్టి లాలనలో ఆమె
ఆ చేతుల్లో వొదిగినపుడు ఒప్పులకుప్పను నేనే
చీకడం నడవడం నేర్చానేనపుడు..
ఆమెతో అనుబంధపు వయసు రెండేళ్ళూ
ఒకరికొకరం అర్థమవుతున్న తరుణంలో.. నేనే ఆమె సర్వస్వం
ఆమెకు ఇంకేమీ అక్కర్లే  ఈలోకంలో
నడవబోతూ పడిపోతున్నా మరి..
తెలిసిందిగా తను నాతోనే ఉందని
తగిలేదెబ్బల భయం లేదిక

మాటలే ఒకరివి ఒకరికి అలవాటు కాలేదింకా
అవసరాలు మాత్రం అవగతమౌతున్నాయ్.
ఇప్పుడేమో నేనింక పక్షిలాగ తిరగగలను
రెండు దాటి మూడొచ్చి మాటలొచ్చి ఆటలొచ్చి
బడి అనే కొత్తలోకపు చదువుల జీవితం నన్ను మార్చి
తయారు చేసేది నన్ను పాలనురుగు తార లాగ
వచ్చాక బడినుండి గంటైనా ఉతకాలి చాకి మురికి వదిలేలా
ఒళ్ళంతా తోమి నిమిరి దెబ్బ కట్టు కట్టాలి
ఆమె నా రేవు తీరం నా మనసే నావ చుక్కాని
నాకింకా గుర్తే నాలుగేళ్ళ వయసప్పుడు
ఎవరి చొక్కా చించానో .. ఇంటి మీద గొడవకొస్తే
మాట ఎవరు పడ్డారో ఆటల్లో ఆలస్యం
ఇంటి బాట నడచినప్పుడు
ఎదురుచూపు గుమ్మానిది బెదురుచూపు ఆమెది.
కళ్ళారా కానరాగా చేతుల్లో చేరగా

అందించిన కౌగిలింత నేను గాల్లోకి తేలినంత
కలిసి చేసిన గైహికాల్లో, ఆటల్లో చెదిరిన ఇంటిపనిలో
చెరగని చిరునవ్వు వెనక..  అబద్ధాల అలక వెనుక
రెట్టించిన శ్రమ తనది.. కొలవలేనితనం నాది
కాలంతో పాటు నా కౌమారం కరిగింది
ఆమేం చెప్పినా వినని అహం కలిగింది
అనుబంధాల ఉన్నతి కానని అల్పత్వం పెరిగింది
గడచిన కొద్దీ ఆమె వడిలింది నా ఈడు మరి వంగనంది
నా మంచే ఆశించి చదవమనేది చెంత చేరి
పెడచెవిన పెట్టా.. అప్పట్లో మరెందరో 'ఆమె'లు నాతో
అందులోన ఒకరిని కోరుకున్నా తోడుగా
మమత లేని లోకంలో నా వలపుల తలపులు
మారిపోయా మరికాస్త ఆమె నేర్పని విద్యలతో
హత్తుకోవాలని ఆమె ఆశ.. తప్పుకు తిరగాలని చూశా
చూశా ఆమెను చీదరగా.. హేయంగా
ఎప్పటిలా ఎదురుచూపుతో ఆమె గుమ్మంలో ఆత్రంగా
ఇంటిపట్టు ఉండకుండా చిల్లరగా తిరుగుతుంటే
తిట్టాలని తనకున్నా ఒక్క మాట అనలేదే!
ఎప్పటికైనా మారక పోడనే ఆశ తనకు చావలేదే!
నాకేమి లెక్క!! ఎపుడో నేనెదిగిపోయా
నాది కాని లోకంలో నేనేమో ఒదిగిపోయా
నాకూ తనకీ నడుమ ఒరుసుకునే ఓ నది ఉంది
వదిలేశా ఆమెనిపుడు.. ఎదిగేందుకు నాకొక పని ఉంది.
చిన్నగా నేనున్నప్పుడు తన అహమహమిక  చంపుకుంది
పట్టింపులు లేవు నాకు నాలక్ష్యం నాకుంది
ఊరు నాది మారింది నేను తనతో ఉండరాక
ముసలిదైన మనిషి మీద అణుమాత్రం జాలిలేదు
నా అవసరమిపుడే తనకున్నా నే దొరకనంత దూరాన
అంగడి వేలంపాటలో పడివున్న చెడ్డవాడ్ని
ఒకటో రెండో ఏళ్ళల్లో ఒకటి రెండయ్యే ఇంటివాడ్ని
అప్పుడేమీ ఉండదుగా ఈ మాత్రపు ఝుంఝాటం
నేనేమో కొడుకుని..  ఆమె నా కన్నతల్లి

# పేపరుతో నాన్న

నాన్న అర్థమంతా.. నా చదువుల దీపావళి వెలుగులకే
తన అవగాహనైనా, సంపాదనైనా కాలుతున్న మతాబే
నాకన్నా నా భవితను నిర్వచించేది తన కన్న కష్టార్జితమే;
జ్ఞానమైనా, ధనమైనా అర్థానికున్న సమస్త నానార్థాలకూ
పర్యాయపదం నాన్నే

ఉద్యోగప్రకటనల కాలం కళ్ళ కింద కలిగేది తన రెక్కలలోనే
నాలుగు రుపాయల కాగితాల దొంతరైన పేపరు
ఉద్యోగ సమాచారాన్ని ప్రత్యక్షప్రసారం చేసే పావురాయై
ఆ నాలుగురాళ్ల మనిషి మీదే వాల్తుంది తెల్లారగానే

రెక్కల టపటపల్లా పేపరు రెపరెపల్లో ఎగిరే కళ్ళు తనవే
దాణా తిన్నట్టుగా కాక పిల్లకు పెట్టేటందుకు
పుక్కిట పట్టే ప్రయత్నం
కనబడ్డ ఆశల మెరుపులను తెల్లారే కురిపించాలని
ఉరిమి ఉరిమీ నను తడిపేస్తాడు తడిమేస్తాడు దబాటంగా

ఆవిరైన చమట చుక్కలు ఘనీభవించిన మేఘమై నాన్న నా పైన
గాలాడని వేళలలో వర్ష పాత సూచన అమ్మ భరోసా నా తరుపున
జల్లో జడివానో నా ప్రయత్నం..
గాలివాటు ప్రయాణంలో తీరం దాటుతూ నేను

వానకారు కోయిలై ఫలితాలకోసం
రాశి-ఫలాల వేటలో..
మళ్లీ పేపరుతో నాన్న
నా కాలం కలిసొచ్చేదాకా కదలని చిత్తరువులా
పేపరుతో
తన మౌనాన తానే

(ఇంజనీరింగ్ సీటు సంపాదించుకోనప్పటి మాట..
నాకింకా .. గుర్తే)

# చావువార్త చదవాలని లేదు

పేపర్లో చావువార్త చదవాలని లేదు
(నిద్ర) లేస్తూనే నిట్టూర్పుల జట్టు కట్టాలని లేదు

ఉన్మాదం ఉద్రేకం నైరాశ్యం నీడలోన
రేపటి రోజుల వెలుగులని వీడాలని లేదు

చిక్కబెట్టు మనసుని, చెదిరితే చావే సాంత్వనా?
జగతి ముందు యువతని బేజారుగ చూడాలనిలేదు

పంచుకున్న ప్రేమల్లో, ఎంచుకున్న చదువుల్లో చెలికాడా!!
ఆటనాపి మడమతిప్పు తలపుల తనువులను తడమాలని లేదు

కారకాలు కోరికలు తీరనివి ఎన్నున్నా
తిరిగిరాని తీరాలకు తరలి పోవాలని లేదు లేదు!

వొప్పుకోకు ఓటమినీ నీ బాట ఎలా అవుతుందది?
పడిన చోటే జారుకుంటూ నిలవాలని లేదు

జీవితం పాలపొంగు.. నీతో నిలచిన వారే ఆస్తి
నింగి తాకు జవ్వలాగ ఎగిరి నేల వాలాలని లేదు

ఎందుకు యశస్వీ! నీకు ఎగసే కెరటం తీరుగ
పడిపోయినా చెడిపోయినా వీడిపోవాలని లేదు?

పేపర్లో చావువార్త చదవాలని లేదు
శోకంలో నేడువున్నా..
రేపటిరోజుల వెలుతురును వదలాలని లేదు
పేపర్లో చావువార్త చదవాలని లేదు
(వార్తను హత్తుకునే పర్యావరణం నాది.. )

# నువ్వే.. నాగురువంటే..

నువ్వే నాగురువంటే కోసి ఇమ్మన్నాడంట వేలు
ఈ కాలంలో ఎవడైనా వింటాడా!!
నా వేలు నీకిస్తాను.. చేయిపట్టు అంటాడా!!
వినడం ఎందుకు!!.. జీవితకాల వేదనకా!!
గురువంటే!.. చెప్పొచ్చు మంచిగా ఎన్నైనా..
మరి అడగొచ్చా ఎదురేదైనా.. అని అడిగారా ఎవరైనా!!
ఏకలవ్యుడి నుండి కాసబియాంకా వరకూ..
విని చెడిపోయిన వారే తడవ తడవకూ
శిష్యలక్షణం అనన్య సాధ్యత్వమే గానీ
అంగుష్ఠ సమర్పయామి కాదే..
కావల్సింది పొందటం కాక వీడనిది కోసి ఇవ్వడం ఎలా ఒప్పు!!
ఆర్తి, అధ్యవసాయం ఉన్నవాడెవ్వడూ  తనకొమ్ము తాను నరుక్కోడు
గట్టిపూనిక ఉన్నవానికి ధ్యాస,శ్వాస.. విద్య మీద కాక
గురువు మీదా!!
అసలు విషయం అదికాదు..

నేర్చేవాడికి ఉండాలి బాగుపడే అలవాటు
విద్య నేర్పేదెవరైనా అందుకో ఆదరంగా;
శత్రు శిక్షకుడి పై నీకెలా గురి!!
అసూయాగ్రస్తుడి శిక్షణ అనసూయగ మారుస్తుందా!
ఉపదేశం పొందలేక వేలిస్తే.. పడిన కష్టం తిరిగి వస్తుందా!!
వంచలేక విరిచే ద్రోణులకు ఈనాడూ కొదవ కాదు
కళ్ళు తెరచి చదవడం రావాలి పుస్తకాల్ని కాదు మనుషుల్ని
బాధల్ని చూడగల్గడం ఎదురొడ్డడం కావాలి
దార్శనికతతో ఉత్తేజితం అవ్వడం తెలియాలి
నానావిధ చరాచరాల సంబంధాలను చూడగల్గాలి
హాని చేసుకోక తప్పనప్పుడు అతితక్కువ తప్పుల దారిలో నడవాలి
ప్రశ్న అడగడం రాని శిష్యుడు వేలేం ఖర్మ తలెవరిదైనా కోసేస్తాడు..
లోకమర్యాదకు తలవంచేవాడు ఇంతకన్నా ఏంచేస్తాడు!!
త్యాగధనుల జాబితాలో పేరుకోసం పాకులాట తప్పు..
మట్టిలోన కలసిన మనస్సాక్షులు కథల్లోనే గొప్ప. (ఓ 5 సెప్టెంబరున)

## సాగిపో

బాల భానుని లేత కిరణం దేహానికి వెచ్చదనాన్ని ఇచ్చి
మనసును తాకక పోతే అది వేకువ కాదు.
చీకటి పరచిన దుప్పటి మెలకువతో తొలగినంతనే
నిద్రాలోకపు విహారాలకి ముగింపు కాదు.
రోజంటే పగలూ రాత్రి కలయిక కాదు
బతుకంటే గుదిగుచ్చిన పనులూ చిట్టాపద్దులూ కారాదు.

ప్రభాతపు తొలి వీక్షణం లోంచే కలలు
వెలుగు రేకల్ని ముద్దాడాలి
రాత్రైనా, పగలైనా కలల్ని వెలిగించుకోవడం..
నింగికీ, నేలకు నడుమ మేఘంలా
గాలిలో తేలి నిప్పునీ.. నీరునీ కౌగిలించుకోవడం.
కాలంతో కలిగిపోయేవరకూ కదిలిపోవడం
జీవితమిలాగే సాగిపోవాలి.

ఏదైనా ఒక రోజు మెరుపు మెరుస్తుంది.
పిడుగులు కురుస్తాయి జీవితం తడుస్తుంది
వడగాలై దెబ్బకు విసిరేస్తుంది
ఓ అవకాశం అందలమెక్కిస్తుంది.
ఒక ఆశని లోకం జారవిడుస్తుంది.
నిన్ను ఈ ప్రపంచం ఏమారుస్తుంది

ఒక్క క్షణం ఆగామా!!
నిరాశల నిట్టూర్పుల లోగిలిలో
నీ బతుకు నడి సంద్రపు లోతుని కొలిపిస్తుంది

ఎదురీతకు సిద్ధపడితే
విస్తరించిన సాగరాన్ని చీల్చుకుంటూ
వడివడిగా సాగే ఓడను తలపిస్తుంది. (ఓ విజయం తరువాత ..)

# బొమ్మరాళ్ళు

పేగు బంధాలు ఊళ్ళేలుతున్నాయి. రెక్కలొచ్చిన పిల్లలు
పల్లె వదిలారో.. ఇల్లేవదిలారో.. కొద్దిగా ఎదిగి పోయారు
ఉన్నారన్న మాటకి పడుకునే ముందు ఫోను మోగుతుంది..
అమ్మా!.. తిన్నావా అంటూ.. మాటల్లో మనుమల ముచ్చట్లు..
ఆత్రం కొద్దీ వినేది ఉండదు.. అలా పెంచమనీ,
ఇలా చదివించమనీ.. ఇక విసుక్కోవడం పిల్లల వంతు
పాపం.. 'అమ్మ కేమీ తెలియదు'.
ఈ వాదనకు మరో-సగం బలం చేకూరుతుంది
అసలు చురకలు అంటిస్తే.. వడ్డీ ముద్దు మాటలు వెన్న పూస్తాయి.
కొమ్మల్లో కోకిలల్లా వినిపించే సంగీతమేగా వంశాంకుర రాగాలు
ఊహల్లో తప్ప కంటికి దొరకరు  వసంతం వేసవి సెలవుల్లోనే
వస్తుంది.. తోటా- దొడ్డీ ఆ రోజుల కోసమే పూసినా.. కాసినా..
ఊసుపోని పునికింతాలు నెలల ముందే మొదలౌతాయి.
ఇంతకాలం కాయలు కాచిన కళ్ళు.. చేతులూ  చెట్లకూ
కాయిస్తాయి.. పూలు పూయిస్తాయి
అరిగిన మోకాళ్ల మధ్య  తిరగలీ తిరుగుతుంది..
నలిగిన వేళ్ళ మధ్య కవ్వం చిలుకుతుంది.

వెన్న కాగి నెయ్యివుతుంది.. వెన్నుఅరిగి..
సున్నుండలు చిమ్మిలీ బలమౌతాయి..
అమ్మ ప్రేమని పిల్లలు పంచుకుంటారు..
ఎవరమ్మమాట వారి పిల్లలే వింటారు. .
ముసలి వాసనలకు మనుమలు మాత్రం దూరంగా ఉంటారు.
కడుక్కోవడం వచ్చేసింది కదా.. బుగ్గల్ని కూడా.
అవసరాలు మారాయి.. కాలం కదిలినట్టుండదు.
కన్నుల పండువ కరిగి పోతుంది.
బతుకు నావ లంగరు ఎత్తే వేళ తల్లితీరం పోటెత్తుతుంది
వ్యాపార పవనాలు బంధాల్ని ముందుకి లాగుతాయి.
వసంతం పారి పోతుంది. శిశిర జీవితాల్లో మిగిలేవి
ఎదురు చూపులే!! బిడ్డలు రత్న మాణిక్యాలు
ఫోను పలకరింపులు మాత్రం ఉద్యోగాల్లా చేస్తారు.
చిన్నికృష్ణులతో అప్పుడప్పుడు మాట్లాడిస్తారు.. అమ్మమ్మలు
యశోదల్లా,  నానమ్మలు రాధికల్లా ఆరాధనలో గడిపేస్తారు
మనసు లేని బొమ్మరాళ్ళు..  వారి జీవితం లోంచే
ముందుకు చూస్తారు. (రెండు తరాల వారధి తరానికి..)

## నేస్తమా!!

ఆలోచనల కవ్వాలతో గుండె కవాటాలను చిలకొద్దు..

అది రంగస్థలమైనా రంగుల ప్రపంచమైనా

కదలాల్సింది కన్నీరు కాదు..కాలి అందెలు

నువ్వేసే ప్రతి అడుగులో నే సిరిమువ్వనై ప్రతిధ్వనిస్తా..

నీ చేతి పారాణి ముద్రలలో వెలుగు కిరణాన్నై ప్రతిబింబిస్తా.

నువ్వెవ్వరని నువ్వడిగినా లోకమడిగినా

ఎప్పటికీ.. నాదిదే జవాబు.

వర్ణ వంధ్యత్వపు లోకానికి వర్ణ రహిత సువర్ణ దీపాన్ని

నడి సంద్రపు నౌక లాంటి నీకు సుదూర ద్వీపాన్ని

## చిన్ని నాన్నా!

కలిసి నడుద్దాం ..

ఈ నీరెండలో ..

అప్పుడే అవసరం నీ తోడు.

ఊసులాడదాం

మలుపులవతల దారి కానరాని వేళ

అడుగుల ముద్రలు కొత్తపుంతలై..

ఎవరిమానాన వారైనవారైనా మునుపెన్నడూ చూడని కొత్త లోగిలిలో

ఆడి పాడదాం..

మమతల పవనాల పలకరింతలనాడు ..కలిగిన పులకరింతలు

నీ కేరింతలు.

నిరంతర బాటసారినైనా మునుపెన్నడూ పొందని

గిలిగింతల వింతలు.

నా గమ్యం ఎటువైపైనా నీతో కలిసి నడిచే అడుగే కద నాన్నా..!

నను నిలిపి ఉంచేది.. నిను నిలువరించేది.. (లక్కికి..)

# ఏదోకారణం

ఏదో కారణం.. పుట్టాం
ఏనాటి రుణమో.. మనడానికీ, బాగున్నామనడానికి
ఎవరికోసమో.. ఎందుకోసమో జీవిస్తాం.. తపిస్తాం
గతుకుల బండి లాగిస్తాం. . నెట్టుకొస్తాం.
కారణం తెలుసుకోవాలనే కోరిక..
దీనివెనుక ఎవరున్నారు!!
కళ్ళు - కాళ్ళు లేని పిల్లల్ని, ఎదిగీ ఎదగని పసి మొగ్గల్నీ
ఈ జగంలోకి ఎవరు రప్పిస్తారు?
ఆట ఆపేసి పైకో-కిందకో ఎందుకు తోస్తారు!
ఎన్నో అవస్థలతో తెరల్ని ఎందుకు దించేస్తారు?

నేల ఈనినట్టు జనం.. నిస్సత్తువతో ముప్పాతిక
రోగం రొష్టులతో మువ్వీసం ముప్పాతిక
వేగలేక ఆగలేని లెక్కలు ఉన్నన్నీ ఉండనీ..
ఎన్ని మాట్లు అదరలేదు భూమి!!
కోట్ల కలలు నడినిద్దురలోకి జార్చిందెవరు!!
ఉసురు తీసిన వరద; పగిలిన గుండెల వెతలెన్ని!!

దారి మళ్ళింపుల్లో మలుపుల్లో రాలిందెందరు!
రైలు మంటల్లో ఎందుకు కాలాలి!
ఆయిల్ రిగ్గో, కారో ఎందుకు పేలాలి!
బాధ, హింస, అతివాదం, ప్రమాదం,
పశుత్వం, విధ్వంసం , పక్కవాడి నిర్లక్ష్యం
కారణాలు బైటపైనప్పుడు కాలంచెల్లడం సహజన్యాయమా?
నిప్పుకాలుస్తుందనీ, నీరు ముంచేస్తుందనీ,
అపరిశుభ్రత , ఆదమరుపు కుంగదీస్తాయనీ
తెలిసి తరాలు మారినా తలొగ్గలేదు ఈతి బాధలు

కుప్పపోసిన తప్పిదాల మోపుని మోయలేక
ముందుతరాలకు అందివ్వ మనసు రాక.. వగస్తున్నా..
పుట్టించిన వాడినడగాలని పడిగాపులు కాస్తున్నా!
కన్నీళ్ళను కాటుకలో ముంచి రాస్తున్నా.
ఒక్కటి తప్పినా మరొకటి తప్పని..
నాది కాని తప్పుల వలయం లో చిక్కి చచ్చిపోతున్నా.
ఈ తెరమీదకు తెలియకుండా రోజూ వచ్చి పోతున్నా..

# కవిని చూశాక..

కవిని చూద్దామని అతని ఊరు వెళ్ళాను
నా ఆలోచనల  పునాదుల్ని కుదిపేసినవాడు
ఆవేశపు అలజడిని కన్నీటితో కరిగించినవాడు

ప్రశాంతమైన నిద్రలేని రాత్రుల్ని వరంగా అందించినవాడు
అలంకారాలు లేని అక్షరాలకు వ్యాపకశక్తి ప్రసాదించినవాడు
అతడెలా ఉన్నా.. ఆ కళ్ళల్లో వెలుగును చూద్దామని వెళ్ళాను

ఆనందం అనుభూతి ప్రధానమని
సూదిమొనకు సున్నితత్వం అద్దేవాడ్ని
ప్రేమను పదాలతో పంచేవాడ్ని
దయను ఆర్ద్రం చేసేవాడ్ని
కానరాని వరాలను గుప్పిట అందించే
రూపం చూడ్డానికి ..ఇది ఈనాటి తలపా!!

కళ్ళను చూపుతో తడుముదామని.. చేతిని చేతితో కలుపుదామని
ఇతనూ మనలాంటివాడే కదా అనుకున్నప్పుడు
నామీద నాకు గౌరవం పెరిగింది
కవిని కనుగొనాలని దిగంతాలలోకి దూకగలనా
వెలుగుని వెతుక్కుంటూ చీకటి బాట పట్టగలనా
అగ్గిని జల్లే ఆకాశాన్ని చుట్టుకున్న వాడ్ని నేను
చల్లబరచే సమీరాన్ని చేరాలని కోరుకునేవాడ్ని
కలల భస్మపు రాశితో బాటలు పరిచేవాడ్ని
గమ్యం చేరలేని దారని తెలిసినా
భుజం తట్టే చేతికోసం అలుపెరుగక ప్రవహిస్తున్నవాడ్ని
కవి సముద్రమో కాదో.. జట్టు కట్టిన సంతోషంలో తేలి
సాటి నదిలా కలసి..పారి... జీవితంతో సంగమిద్దామని
అన్నిరుచుల మట్టినీ ముద్దాడుతూ కథ ముగిద్దామని.

(కవి బివివి ప్రసాద్  కి...)

## నిను చేరాలనే..

నా తలపుల్లో నిలిచి ఉన్నది
నీవైనప్పుడు..
ఎడబాటుకు అర్థమేముంది

ఎద ప్రతిధ్వనించెనా..
అడుగు అడుగులో మెదిలే సవ్వడై..
ఒంటరితనమే నా చిరునామా..

పగలైనా రేయైనా నీ ఊహే
నన్ను నాకు వివరించేది ..

నను నిలువరించి వరించేది..
యుగాల విరామంలో క్షణాలు గడుస్తున్నాయి

అంతరంగాల్లో మనోభావాలే
జ్ఞాపకాల కూనిరాగాలై.. నిలుస్తున్నాయి

ఆకాశం చలి కాగుతుంది ..
నా ఊపిరిలో వెచ్చదనానికి
మంచు కరుగుతుంది నీదిక్కున..

నిను జీవితంలా శ్వాసించనీ..
ఈనేలపై
నా అడుగుల తడబాటు..
నీ ఊహల్లో నేను నేనుగా ఉండాలనే
ఆవిర్లు విరజిమ్మే ఈ గుండె చప్పుడు..
ఆగేలోగా నిను చేరాలనే.

## నిను చేరాలంతే..

ఎంత కష్టమో నిను చేరాలంటే..
అనుకున్నా వన్నెలాడీ! నిను చేరాలంతే..
నే వచ్చేలోగా నీ తకిట తకదిమి.. ఆగదని..
నిలకడ వదిలిన నీ మునివేళ్ళను మునిమాపు వేళల్లో
సందెపొద్దు సూరీడు ముద్దాడివెళ్లేలోగా
అనుకున్నా కలవిడిచి … ఇలనైనా నిను చేరాలంతే..

శీతల పవనాలు ప్రేరేపించే నాదాలై
పక్షుల కువకువలు స్వరజతులై ఉత్తేజితం చేసే వేళ
నిశీధి వీధుల విషాద ఛాయల్లో నువ్వు విశ్రమించవని
అంబరవీధుల పహారా మాని నీకై నిలవనా!

మేఘాల వీవెనలతో చెమిర్చిన మోహానాన్నే తడమనా!!
మంచుబిందువులు నీ పెదవిపై వాలేలోగా నిను చేరాలంతే..

నీ నర్తనలో తడిసి ముద్దైన నేల నాకు కోనేరే..
మువ్వరాల్చిన మెరుపు రజనునై తానాలాడనా

వలపు వాకిట నీ దరిచేరినా నాకది పూల పన్నీరే
దూరాన చలించే నీపై తపనే తమకమై తరించనా
నిను వారించాలని.. వరించాలని వచ్చా నిను చేరాలంతే..

గుండెలదిరేలా వచ్చా వడివడిగా దడదడగా
వెన్నెలకిరణాల దాడిలో నే ఓడేలోగా
వన్నెల విరిమోము ఆడి-ఆడి వాడేలోగా
నా జీవన ఉఛ్వాస నను వీడే లోగా..
ఏనాటికైనా.. ఎలాగో.. నిను చేరాలంతే..
నా తీరంలా నువ్వు నర్తిస్తుంటే..
మెల్లగ నిను ముద్దాడి నే సేదతీరాలంతే

# చార్మినార్.. చెంపన..

ఈ మబ్బులు ఏ ఉత్పాతంలా కనిపిస్తున్నాయ్ చార్మినార్!
ఏ కారో మంటల్లో కాలి ఈ మసి మబ్బుల్ని కమ్మింది
కత్తులు తిట్టుకుంటున్నయ్ ఏమిటీ మరకలని
రాళ్ళగాజుల మండీల్లో పగిలేవి
ఏ చేతి గాజులు?

ఎలా అంటుకుందో చెమ్కీ చుక్కై నీ చెంపన మైసమ్మ
ఆడుగుదామంటే ఇప్పుడు లేదు కుంకుమిచ్చే ఆ బొమ్మ
ఈ ఊర్లో గొడవలకీ అభిమతాలకీ ఏనాడూ లంకె లేదు
గుళ్ళకీ-గోపురాలకీ ఈ లెక్కల పాఠాలు ఎక్కలేదు

ఆ పక్కనే వెలిసినట్టు రంగు పూద్దామనే ఆదుర్దాలో ఒకరు
రంగు వెలిసినట్టు చూద్దామని వేరొకరు

రాలుపూలనగరంలో నీ బస్తీ గరం గరం
నరం తెగే నాటకాల్లో రాలేది కసుగాయలే

జెండాలో రంగులు పైనాకిందా పడి
తెల్లదనాన్ని కుమ్ముతూ.. అబద్ధాలను నమ్ముతూ..
దేవేలికి గుమ్మటాల ప్రాపు..
మతంమత్తుకు మధురసాల కైపు..
ఎవరు అద్దినా అది కృతకం అమానుషాల వికృతం
తలతిక్కనాయాళ్ళకు కేవలం నువ్వో ప్లేగు బంధానివి
భాయీ భాయీ బతుకుల్లో నలిగే అలాయి-బలాయి కానుకవి

(హైద్రాబాద్ పాతబస్తీలో ఓ కొత్త కథ విని..)

# మాటొకటి చెప్పిపోనీ

గాయాలు నాకు గేయాలై వినిపిస్తున్నప్పుడు
గేయాలు గాయాలై సలిపేస్తున్నప్పుడు
నా సాహిత్యాన్ని ఆస్వాదించనంటావా!
విషాద సంగీతంలా నిన్ను ఆలకించమంటావా!!

గాయం నేనైనప్పుడు ఎవరు గాయపడ్డట్టూ!!
కోల్పోయేది స్నేహ సౌహార్దమో కుటుంబ క్షేమమో

నా ముగింపు ప్రజావినోదమో స్వీయ విషాదమో
నాకళ్ళకు నీ కలల భయమెందుకో

ఎందుకిలా నమ్మకాల తరాజు
చీకటితో పాటు మొగ్గుతుంది!

ఎందుకో గడిచిన రోజుల జీవితం
ఒంటరి అలోచనలను కుదుపుతుంది

వాలిన పొద్దు మరునాటికి వెన్ను పొడుస్తుంది
ఏ విషాదాలు మెదులుతున్నాయి తలపుల్లో
నాకెందుకు నేనంటే భయం?
పలుకని నిజాలు నను బేరీజు వేస్తున్నాయా!
నేనుండని రేపటి వెలుగుల గుట్టు ఈరోజే విప్పి పోనీ

అలకల రాణీ!
నువ్వొప్పుకున్న నెప్పేగా మన అనుబంధం
ఏళ్ళు గడచినా మళ్ళీ నీతో మనసువిప్పి చెప్పుకోనీ
నిను ఎప్పటికీ ప్రేమించిన మాటొకటి ఈరోజు ఇప్పుడే చెప్పిపోనీ.

## తుహినం తుడు

పేరు తలిచి నిను పిలిచి వినేలోగా
ఈ శరద్రాత్రి చలై నను కొరికేస్తోంది
ఏదో మాట నను తడుముతోంది.. నీ తలపుల్లోకి తరుముతోంది
తపన తలపులను తాకలేదా
గుండెలను కరిగించి పోసిన గంట
కాలమై కాలుస్తుందో.. రవమై మోగుతుందో!

ఎంతదూరాన ఉన్నా.. నీ మేనిగంధాల పలకరింతలు
నను దాటివెళ్ళిన జాడలను
మరుగుపరచలేక నిలువనీయకున్నాయి
నీ ఊహే లోపలా బయటా మంచుని కరిగిస్తుందే
నిట్టూర్పుల్లో మన ప్రేమ వెచ్చదనం
మంచుబిందువులను ఆవిరి చేసినా
గతించడాన్ని మాపలేని కాలాన్నడుగు మన సంగమాన్ని

నిరంతరతను నింపుకున్న మన స్నేహాన్ని అడుగు
నిన్ను-నన్నులను దాటిన మన భావననడుగు
వేర్లు వేరైనా ఒకటైన మన జీవితాలని అడుగు
మనం లేని నాడు ఒకరికొకరిని చూపించడం నేర్పమను కళ్ళకి
మన అందాలు నింపుకున్న లోకంలో
అనవరతం ప్రేమై శ్వాసించనీ హృదయాన్ని
ప్రేమలేని మనసుల్నీ.. ప్రేమించనీ
చెవులకు నిశ్శబ్ద నిలయాల్లో ..
పారవశ్యపు పదనిసనలను వినిపించనీ
సాయాన్ని స్పృశించనీ చేతులను.. ఆర్తిగా ప్రార్థనలో
పెదవి పలుకనప్పుడూ.. నా గళాన్ని విను
కన్నీళ్ళను నీ పెదవులతో చెరిపెయ్యరాదూ..
నా ప్రమేయం లేకుండా రాలుతున్నాయి పూలై
పొదవిపట్టుకో నన్ను నీకు దూరంగా ఉన్నప్పుడూ.

## అలాగే.. అలాగే..

నిద్రలేచాకా నేలను కాలు తాకితే ..
పచ్చనోటు తొక్కినట్టే.. అద్దె డబ్బులు.. పెరిగాయి కదా!
అడుగులేసి అద్దం చూసేలోగా ప్రతిబింబం హెచ్చరిక
పేస్టు పొదుపుగా వాడమని.. స్నానం గోరువెచ్చని నీళ్ళతోనే సరి
సబ్బు కన్నా చెయ్యే ఎక్కువ అరుగుతుందీలోపల
తువ్వాలన్నా సరిగా ఆరేసుకుందాం. ఎన్నని కొంటాం!!
లోగుడ్డలూ మేజోళ్ళూ పోనీలే ..
మరుగున చిరుగులు కనిపించవు
ఏమోయ్! పెళ్ళికి కొన్న రింకిల్ ఫ్రీ పేంట్లెక్కడ.. ఈ బటనుకుట్టు.
లంచికి కారేజీ పెట్టరాదూ.. కాంటీన్ రేట్లు పెరిగాయీ!!
బస్సెక్కుదామా.. బండితీద్దామా!! ఆఫీసుకేగా  ఫ్రెండు తోపాటే..
అరె! పెన్నేదిరా.. నీదివ్వు ఈరోజుకి
సాయంత్రం వచ్చేటప్పుడు నీకేంకావాలి!
అడుగు పర్లేదులే తెస్తా.

నాన్నా! బాగాచదువుకో.. లేకపోతే మీ నాన్నలానే..
కాఫీ ఎందుకూ.. ఆఫీసులో తాగేస్తాగా.
ఏమోయ్! పండక్కేంకొనుక్కుంటావ్! నాన్నా!! నీకు..?
ఏంకావాలి చెప్పండి.. ఎలాగైనా కొనిస్తా సరేనా
మా ఆఫీసతని పెళ్ళుంది ఈనెల.. మంచి చీర కొనుక్కో..
పిల్లాడికెక్కూడా.. ఇంద క్రెడిట్ కార్డు.
హలో.. హలో..టెలీఫోన్ బిల్లేగా .. ఇప్పుడు కట్టేస్తా..
ఆ గాస్సిలిండర్ డబ్బులిలా పట్రా..
సాయంత్రం  సర్దుబాటు చేస్తా. నీకో గుడ్ న్యూస్ ..
ఈనెల డి.ఎ. పెరిగింది ఎంతో తెలుసా!! మూడొందలు
రాత్రి లేటవుతుంది.. మీరు భోంచేసేయ్యండి..
బాసుతో పనుంది సాయంత్రం.
నీకు మల్లెపూలూ.. వాడికి హనీకేకు.. అలాగే.. అలాగే..
(మధ్య తరగతి మహాభారత యుద్ధంలో యోధులందరికీ..)

## అందమా ! నువ్వెవరు!!

అందం తనమీద రాయమందో కవిత
అంగరాగాలు లేని అమ్మాయి కోసం
ఆరోగ్యమైన జవరాలికోసం, చెలువ పిల్లకోసం
ఎక్కడని వెతకను ఏ కొలతన కొలవను
అద్దాన్ని అడిగా తనే అందమంది
అద్దమే అందమైనప్పుడు అన్నీ అంతేగా
ఉండాలేమో మరి  అందరికీ అద్దంలాంటి మనసు
మనల్ని మనలానే చూసుకునే సొగసు
అద్దాలమేడలో ఉన్నది అందమైనదైపోతుందా
అద్దం అందమైతే రాయికెందుకు లోకువ
రాలిపోతే పాలిపోతే పగిలెనే భళ్ళున
ఆడపిల్ల అద్దమూ వద్దు నాకీ పోలిక
రెండూ పెళసరే ఎంచుకుని వేసుకోవాలి పోగిక.
ఏది మంచో లెక్కలేవి ఎందుకొచ్చిన చిక్కులివి
ఊహల్లోని బొమ్మకు పోయలేనా ప్రాణము

పుట్టినప్పుడు పురుడు పోసిన మిస్సమ్మలా
బళ్ళోకెళ్ళే బుజ్జోడికి టీచర్ లా
కాలేజీ కుర్రోడికి ముందుబెంచీ అమ్మాయిలా
నాకెప్పుడు కనిపిస్తావో అందమా..
స్నానమయ్యాకా అమ్మ నుదుటి బొట్టులా
పల్లెగట్లమ్మట నీడ పంచే చెట్టులా
కొబ్బరి ముక్క పగలగొట్టి పెట్టే గుడిమెట్టులా
మారుతున్నకాలంలో మళ్ళీ నిను చూస్తానో లేదో అందమా!
అందమంటేనే మిస్టైన బంధమా
కలల్లో నను తాకే భావనా గంధమా
అక్షరాల పలుకరింపులతో ప్రపంచాన్ని పరిచయం చేసే గ్రంథమా!!
అసలు నువ్వెవరు అందమా!!
నను కన్న ఆనందమా.. నే కనుగొన్న స్నేహమా
నాకింకా పుట్టని పసి బంధమా. .. అంతుపట్టని అపురూపమా
అసలు నువ్వెవరు అందమా!!

# నో వర్రీస్!!

ప్రవాహం కవితావేశంలా లాగేస్తుంది ఎటోకటు
ఉద్వేగం ముంచేస్తుంది అది కలలపై రోకలిపోటు
నైరాశ్యం నమిలేస్తుంది పంటికింద పెదవిని..
ఊహించని పిడుగుపాటు..

పరిస్థితులు పగబట్టినా
ఇబ్బందులు చుట్టుముట్టినా.. తట్టుకోవడం
బాధ్యతల బరువుల్లోనో
ఓటమి అంచుల్లోంచో జారిపోతున్న మనల్ని
మనమే నిలబెట్టుకోవడం
ఇదికదా! అవసరం పుట్టినందుకు.
దేవుడనే వాడుంటే
నువ్ మోయలేని బరువుని
నీ భుజాన మూటకట్టడు.

పరీక్షలకే పారిపోతామా..
పరిస్థితులకే మారిపోతామా
ప్రవాహానికే జారిపోతామా..
మనకి మనం అసలేంకాకుండా పోతామా!!
నిలబడటం నీవంతు.
చెయ్యివ్వడం.. చెయ్యనివ్వడం అంతా నీ హ్రస్వదృష్టి
ఎవరు చూస్తే ఇంతవారమయ్యామో..
వాడొడే చదరంగంలో ఇదో మాయ

లోతుచూసుకుని నడు ఎక్కడైనా
తప్పుకునే ఆలోచన మానుకో
నిన్ను మళ్ళీ తయారు చేసుకునేది నువ్వే..
నిన్ను నీలా పొందడం నీకే సాధ్యం
నువ్ తప్పుకుంటే జరిగేనా నీ పునః సృష్టి !!

# ఇంకేం కావాలి!

చూస్తాం.. లోకం.. ఆ క్షణమంతా మనదే..
లోకమా క్షణమా ఏమో.
నచ్చిన రంగులుంటాయ్.. మనల్ని కావాలంటాయ్
రంగవ్వాలా! నచ్చాలా!! ఏమో.
వెచ్చని ఆలోచనలుంటాయ్ లోనికి రమ్మంటాయ్
ఆలోచనలనా! వెచ్చదనాన్నా! ఏమో.
చిక్కని జవాబులుంటాయ్ కనుక్కోమంటాయ్
కనుక్కోవాలా! అడగాలా! ఏమో.
విప్పని ముడులుంటాయ్ చేయి చేసుకోమంటాయ్
ముడులనా .. వాటి జడలనా ఏమో.
కొన్ని కోరికలుంటాయ్
చూడాలని.. వినాలని .. ఆఘ్రాణించాలని.. స్పృశించాలని
రుచిచూడాలని.. ప్రేమించాలని  కో రాలా!! కోర పీకాలా ! ఏమో.
పుట్టినప్పుడు ప్రతీదీ అందంగానే ఉంటుంది.. పసిపాపలా.
ఆ క్షణంలో అదే లోకం..

లోకంలోకి అందమైన దాన్ని వదిలేయ్..
నీకు నచ్చినట్టు రంగరించు.. ఇచ్చేయ్..
నీ రంగులతో లోకం నింపు.. ఇంకేంకావాలి!
లోనికి వచ్చిన ఆలోచనల వెచ్చదనాన్ని పంచు
జవాబు అడుగు.. దానికదే కనుక్కుంటుంది ప్రశ్నని
జడపట్టుకో ముడి పట్టుబడిపోతుంది తాడో-పేడో తేలిపోతుంది
కోరికలూ!.. మీ మూలాలు వేరు లోనికి చూస్తావా..
బయటదారులు కనిపిస్తాయి. మనసుకి మార్గాలుంటాయి..
గొళ్ళాలుంటాయ్ తెరిస్తే బయటవాటిని లోపలే చూపిస్తాయి
బయటవెతికావో నిను లోపలపెట్టి చీకటి పాల్చేస్తాయి.

చీకటిని నీ వివేకంతో కాల్చేయ్..
మనసంతా నీ ప్రపంచమౌతుంది..
ఈ ప్రపంచానికే నీమీద మనసౌతుంది.
ఇంకేంకావాలి!! (ఓ నిరాశావాదికి..)

# ఇదేం న్యాయం దేవుడా?

రాసిందే రాయడానికి తలదించట్లేదు నేను
ఎప్పటిలానే.. తలవంచే రాస్తున్నా..
చేసిన తప్పు చేయడం నీకు తప్పనపుడు
రాసిన రాతే రాయడం నా తప్పెలా అవుతుంది!
అడిగిన ప్రశ్నే అడగడం నాకు తప్పదులా ఉంది.
ఆరోజు వైష్ణవి.. ఈరోజు సాన్వి.. మధ్యలో తెలియనివి ఎన్ని!!
పేర్లే మైతేనేం తలతిక్క లెక్కలు నీవి
నా ప్రశ్నకు జవాబు చెప్పలేక తప్పుకు పోయావు
ఒకే బొమ్మలా ఇంకోటి మరోటీ చెయ్యడం వచ్చా నీకు
ఎవరిని చూసి మైమరవాలి ఈ వెతల్ని! కడుపు కోతల్ని!!
సైదుబాబు పాపం పండాలంటే 25 ఏళ్ళు నిండాలా!!
సాన్వి పాప 10 నెలలకే నీ ఇంట కొలువుండాలా?
మా కళ్ళన్నీ.. నీళ్ళతో నిండాలా!!
ఇదేం న్యాయం దేవుడా?

నీ బండబడ.. నీకు తెలియదు.. ఇది మాకో అంటురోగం
చరిత్ర కాలిన మచ్చల్లో పశుత్వం పాఠాలు నేరుస్తుంది.
గడి తప్పిన తప్పుల తడకల బడి మా లోకం
క్రియేటివ్ గా క్రిమేషన్ చేసే పోటీల్లో ఎవడికి వాడే సాటి
కిడ్నాపర్ ఎవడైతేనేం చంపడంతోనే ముగిసేది స్టోరీ
Marzipan పసిపిల్లల బొమ్మల్ని దాచుకునే వాళ్ళనుంచి
కేకుల్లా చేసుకుని కొరుక్కు మింగే వాళ్ళ వరకూ కన్నతండ్రివి.
ఎందరి ఇష్టాలని నువ్వు చూస్తావ్.. ఎవ్వరి మాట కాదంటావ్!!
పకోడూ బాగుండాలనుకున్నామా. .
రేపటి రోజు వార్తలకు ఈ రోజే రక్తపు రంగు పూస్తావ్
పసిమొగ్గల్ని తుంచేసి..తల్లి తీగకు కడుపు కోస్తావ్
తలతిక్క లెక్కలు నీవి..
ఎందుకు మమ్మల్ని పరీక్షిస్తావ్?
ఇదేం న్యాయం దేవుడా? (ఏదో కారణంగానే.. ఇదీనూ)

## ఉప్ప 'ధనం'

నా ఉద్వేగం ఎక్కడ ఎందుకు అంకురించినా
ఎర్ర మందారాల్లాంటి నెత్తురు కణాలను
తెల్లమల్లెల్లాంటి కన్నీరుగా చిలికించినా
మారని గొప్పతనం నాలో ఉప్పదనమే
నా స్వేదం ఎక్కడ ఎందుకు చిందించినా
నిర్వేదం నుదుటన నాట్యం చేస్తున్నా
నీరు చల్లినట్టుగా రగిలి పొగలు కక్కించేదీ..
మారని తరాల స్వరాలని బయట తడిపి
లోన చల్లబరిచేదీ ఈ ఉప్పదనమే
మనసు కరిగించే ఉప్పు .. మంచు కరిగించే ఉప్పు
ఈ తెల్ల బంగారం ఖరీదు మనిషి నిలువెత్తు
పుణ్య పురుషులు కర్పూరాలో కాదో.. ఏమో.
నా మనుషులు ఈ రస కర్పూరాలే.. చిటపట జ్యోతుల హారతులే
మనిషి జీవించివున్నాడంటే.. కష్టాల కొలిమిలో
ఉప్పు.. నిప్పుతో చిటపటలాడ్తున్నట్టే

ప్రేమ పాశంలో పడి.. నీరుగారి కరిగిపోతున్నట్టే
ప్రేమ తియ్యదనంలో కలిసి.. మనసు నిర్జలీకరణాన్ని నిరోధిస్తున్నట్టే
ప్రేమంటే ఏదో ఓ  రుచి కాదు.. జీవితం-రుచి తెలిసిన
కమ్మని కూర.. అమ్మ అప్పుడే పట్టిన ఆవకాయ పచ్చడి
ప్రేమంటే జీవన రసధుని మధుర భావనా లాహిరి
జీవితం ఆ ప్రేమ కోరే మనసు చేసే సాగర ఘోష
సాగర తీరాల అవతలి జీవితాలూ ఉప్పనే నేస్తమా!
ఆకర్షణల ఉప్పెనల తీపిని పంచకు..చితిమంటల ప్రేమను తియ్యగా
ఎంచకు.. ఆకురాయి అగ్గిరవ్వలను కళ్ళతో ఒంపకు
ఉప్పదనం లేని చోట జీవితం చప్పగానే ఉంటుంది
గొప్పతనం కోరే మనసుకు నా మాట ఉప్పగానే ఉంటుంది
వడ్డించిన విస్తరిలా ఉండదు జీవితం ఎన్నడూ
అయిన కూట్లోకి అయిన కూర ఉంటే చాలదా
సమన్వయం లేకపోతే జీవితం.. ఉప్పులేని చప్పిడిమెతుకుల
ముప్పై.. తిప్పలు పెడుతుంది (ఆర్వీఆర్ గారి పాఠాల్లో సారాన్ని వండి...)

## పదాల తోట దడి..

పదాల తోట దడి కొక్కాన్ని తీస్తున్నా మూస్తున్నా
పూల తావి తాకిన తుమ్మెద ఎద చేసే ఝుంకారం
నీ నామజపమైన వేళ

చెదిరే తూనీగల్లా నా భవభావాలు గడికోమాటు బరి దాటుతున్నా..
పదాల తోట దడి కొక్కాన్ని తీస్తున్నా మూస్తున్నా

నిను వెతికి వెతికి వగచి  తలవంచి నిలువలేక
ఈ భావావేశపు గింగిర్లు

జారిపడ్డ ఆలోచనల కంపన కంటి కొలనింట.
కదిలే పిట్టలా కనుచూపు మింటివెంట..
పదాల తోట దడి కొక్కాన్ని తీస్తున్నా మూస్తున్నా
ఎండిన ఆకులా నా మాట రాలి తేలి నిన్ను చేర ముద్దాడ..
మాట తేరుపై మనసు చేసే ఓ సంధ్యా రాగం మన ప్రణయం

పదాల తోట దడి కొక్కాన్ని తీస్తున్నా మూస్తున్నా
ఉక్కిరిబిక్కిరిలో కదలాడే కలువనీడలా వణికిస్తున్న నీటి పొర
తడుస్తున్న కనురెప్పలను పొడుస్తున్న వెన్నెల కిరణాల తుంపర

జాలి మనసుతో వేడుతున్నా ..
నీ రాక చూడని కాలాన్ని
నీ మాట వినిపించని రాగాన్ని
యుగాల ఎడబాటుని
నన్నొదిలి వెళ్ళమని
పెదాల పరదాలు తెరదీసి పలువరిస్తున్నా
పదాల తోట దడి కొక్కాన్ని తీస్తున్నా.. మూస్తున్నా..

## భయ్యా! Diversity ఎక్కడ!

జీవవైవిధ్య సదస్సు ముగిసింది.
ఇక కాగితాలపై అభయారణ్యాలు పెరుగుతాయి
ప్రపంచ ప్రతినిధులారా!
విమానాలెక్కండి.. సురక్షితం మీ ప్రయాణం

డేగల్లేవిక్కడ.. మాది డేగలేని దేశం
అంతర్జాతీయ జలచరాల్లారా!.. sea horse లూ!!

ఆక్వేరియం ల అద్దాల్లోంచి నేరుగా మీరు మా కడుపుల్లోకే
ఔషధ మొక్కలూ ఎదగాలి మీరు
విత్తన వ్యాపారమా! సౌందర్య వర్తకమా ! వర్ధిల్లు ! వర్ధిల్లు !

వర్ధమాన దేశాలూ!! అప్పు అడగండి..
20 సూత్రాల పథకం అమలుకి డబ్బుల్లేవ్
ఏకథ చెప్పినా కావాల్సింది కనకమేగా!

de Souza Dias! ఈ సాయంత్రం నుండే నువ్వో అనామకుడివి
నీ ఆచరణ మంత్రం అమలు ఇక కంఠశోషే..

20 ఏళ్ళు నిండిన సదస్సుల ఆరంభానికన్నా
ఈరోజు ఓ redlist పొడుగు 400 లైన్లు ఎక్కువ
మొక్కలెక్కువా! మాకు కుక్కలెక్కువా!

కొరియా! తయారయ్యావా 2014 సదస్సు కి
oyester ల pancake ప్రపంచానికి తినిపించడానికి.

అమెరికా! నువ్వేనయం.. నువ్వేనయం.
చాంద్రాయణ వ్రతం నీ సంస్కారంలో లేదు
(మెచ్చిన రాళ్ళబండి కవితా ప్రసాద్ గారికి, .. కవిసంగమంలో
కలిసిన మిత్రులకు..)

# గుల్ మకాయీ★!

నువ్వెవరని మాకు ఈ తలపులు మలాలా!!
11 ఏళ్లకే బ్లాగర్ వయిన పిన్నవనా!
సాటికవి కన్న కూతురివనా!!
చదువులతల్లి పేరేదైనా నీకది పర్యాయపదం
నీడైరీ చదివాక తెలిసింది నీవొక నిశ్చయమని..
జనవరి 4, 2009 న నువ్ బిబిసి బ్లాగులో రాసిన మాట..
రేపు స్కూలుకి వెళ్ళాలని.. ముందురోజుల నీడన
చదువు పేరెత్తితేనే భయం. నీమాట.. ధైర్యమైంది ప్రతి నోటా..
అర్థమైందిలే ఈ రోజ . నీశక్తి..ఆలోచన
మురిపించే స్వాత్ అందాలలో జ్వలించే క్రాంతిరేఖ
నీ చిరునవ్వని 'రేడియో ముల్లా'ఫజలుల్లా గాడు చూసిన
2 ఏళ్ల భయం పేరే నువ్వని మలాలా..
మా నాగరికత నడిచొచ్చిన కైబర్ కనుమలలో సుమానివి..
రాజకీయ రంగమే నుదుటి రాత మార్చగలదన్న నీ నమ్మకం
ఆధునిక విద్య అవసరమని.. నొక్కిచెప్పిన నీ అంతరంగం
వాడిన ముఖం వికసించాలని ఈలోకం ఎదురుచూస్తోంది.
అదే తెగువ చూపించు.. బతుకుతో పోరాడు.. బతుకుతూ పోరాడు.
తాలిబన్ల పిరికితనానికి బదులివ్వ రావాలి అసలు సిసలైన జవాబై.
నా కంటి చెమ్మ సాక్షిగా చెబుతున్నా
పాకిస్తాన్ లోగిలిలో పూచిన మానవతా ప్రియనేస్తమా
నువ్ విరబూయడం కాంతి పంచే సూరీడుకి అవసరం
రేపన్న లోకం లో నీ స్ఫూర్తే మేము కోరే మార్పు..
బడికెళ్ళే ప్రతిపిల్లా మలాలాలా..
ఉద్యమించే అవసరాలు రానీకమ్మా!!

నువ్వెత్తిన పిలుపులో మేమంతా గొంతుకలుపుతాం..
ఎందరికోసం మొదలుపెట్టావో.. అందరం నీ బాట పడతాం..
బదులివ్వరావా అసలు సిసలైన జవాబై.

( ★మొక్కజొన్న పువ్వా! : మలాలా జీవన్మరణ పోరాటంలో పడి ఉండగా..
కవి కిరణ్ గాలి కి తోడుగా)

## ఇదికదా జీవితం..

ఆలోచనాలోచనాలు తెరతీసిన వేళ
అనుభవాలు ఎన్నిమార్లు ముప్పిరిగొన్నాయో
మూసిన కళ్ళలో పలికే తన్మయరాగాలు
లాలి పాడే ఆలంబనలో పవళింపే ఓ భాగ్యం
ఒక్కో భావన.. పిల్లగాలై తాకుతూ ఉంటే
వసంతం వరించి వచ్చినట్టు తలపుల గిలి
ముందరి విందులు ఊహకందవు
రేపటి రోజు ఎరుక ఎవరికి..ఈరోజు నీ లోకంలో నేను..
వారాంతపు వాకిట నిల్చొన్నప్పుడు
నేలా నింగీ నా నీడే..
స్నేహ తారల మిణుకులు నీ ముంగిలి చేరవ్..
బద్ధకపు భాగ్యదేవతా! నువు నన్నావహించేవేళ
వంటింట్లోంచి వినవచ్చే సన్నాయిగీతం.. “తినిపడుకోరాదూ!!”
అబ్బా! ఈ అవసరం లేని లోకంలో నే ఉండలేనా!!
ఏవేళైనా!! ఈవేళైనా... (ఓ సెలవుదినం అనుభూతి..)

## రాయడం అసంకల్పితం

తప్పనిసరి స్పందనలు కొన్నుంటాయ్
మెలకువ వస్తే కళ్ళు తెరచుకున్నట్టు..
మెళకువ నేర్చితే నైపుణ్యం పెరిగినట్టు
చల్లదనానికి ఒళ్లు ఝల్లుమన్నట్టు..
మంచితనానికి రూపంలేనట్టూ..
చూసినేర్వాల్సినవి కొన్నుంటాయ్
తరగతిగదిలో బోర్డుమీద అక్షరాలు..
వలపుల మదిలో దాగలేని భావాలు
అవసరాలను తీర్చే అనుకరణలు..  వాటిని నేర్చే కారణాలు
వాటి కారకాలు.. ఎందుకు రాస్తున్నానంటే ఏంచెప్పను!!
తల్లి కడుపున పడడం అక్కడే ఉండడానికా!
మనం పుట్టడం ఏడుపు వినిపించడానికేనా!
మన చూపులో అనుభూతులో వాటి లోతులో
అనుగు కోడిపెట్టలా పొదగపెట్టుకోవడానికా! ఓ మాటైనా ఉండొద్దా!
మనమధ్య జట్టుకట్టుకోవడానికైనా..(బ్లాగ్ మిత్రులకు..)

## ఏదో కాంతి నాలో

ఏదో కాంతి నాలో ఊరెళ్తున్నందుకా!!
'ఎందుకో అంత ఆనందమని' సహచరి
మాటల్లో తనని విడిచివెళ్తున్నపుడు.. ఎత్తిపొడిచేటంత
ఏ బంధం మిగిలివుంది అక్కడ అమ్మతప్ప!!
గతం.. ఊరుచేరిన నడకల్లో ..వీధి దీపాల్లా
అనుభూతుల నీడను కుదుపుతోంది అడుగుల్లో
ఇంటిదారిన చూపు తాకి తేరువ జారిపోతున్నట్టు
పారజూసే పరిచయాలు పలుకరించాలా వద్దా అన్నట్టు
ఈల పాట కై చుట్టిన పెదాలు చుట్టుపక్కలు పట్టించుకోనట్టు
చేరే అడుగుల్లో వయసుని దూరం తగ్గిస్తున్నట్టు
వీధి మలుపు తలపులతో మెలితిరుగుతున్నట్టు
గుమ్మం ఎదురుచూపులో అమ్మకు నా బాల్యాన్ని పంచుతున్నట్టు
ఏ పువ్వైనా తోటలో ఇంత వికసిస్తుందా
మింటివెలుగు నవ్వులతో ఆశీస్సులు కురిపిస్తున్నట్టు.
నా కంటిముందు అదే కాంతి నను మళ్లీ కన్నట్టు కనుగొన్నట్టూ

## ఓ దీపావళి వేళ

అమావాస్య రాతిరి
ఉపద్రవం ఘనీభవించిన చీకటి.. ఎప్పటి లాగే ఈ యేడూ
బాంబుల ఆర్భాటాలతో.. జవ్వల చెలగాటాలతో
ఎంతసేపని ఆపగలం పారి ఆరే వెలుగులను
డబ్బుల్ని కాల్చి వెలిగించిన చిచ్చుల్లో
పసి నవ్వులే వెలుగుతాయి
గతించిన నా బాల్యం లీలలు
నిముషాల్లోనే మిగులుతాయి.
ఎంత తమాయించుకున్నా.. నాలో ఆరని శివకాశీ మంటలు
కాలిన బతుకుల నీలినీడల్లో
మందుగుండు ఆర్పిన దీపాలు
ఇవేం పట్టని నేను.. చిన్నారి కంటి వెలుగుల కోసం
మనసూ చేయీ కాల్చుకుంటు.. ఏదైనా కాలితేనే పండగా!
జీవితాన్ని రాలిస్తేనే బతుకు పంట పండేనా?
దీపం వెలిగించి ఉంచితే చాలదా!!

## నాణెం గాల్లోకి ఎగురుతుంది

కాలం కలల్ని నాణెంలా ఎగరేస్తే ఆశ.. కిందకి వస్తుందని
ఆర్తితో మనిషి ఆకాశం చూసేది ఓ దైవ స్పర్శని ఆశించి
గురుత్వాకర్షణ తెలీని కుర్రాడు బంతిని ఎగరేసి
దేవుడితో ఆడుతున్నానని అనుకుంటున్నట్టు
ఎగిరి కిందకొచ్చే ప్రతీదీ విధి విలాసం
మనసెంత రువ్వినా ఫలితం శిరోధార్యం
బొమ్మా బొరుసులు.. పొందడం కోల్పోవడాలే
పుట్టుకతో పోయేవి ఊహల్లో కూడా తెలియవు
ఏ స్మృతుల లోతుల్లోంచి బయటకు వస్తామో మనం!!
ఎదిగే కొద్దీ బాల్యం నలుగుతుంది
బడి బరువుల్ని పెంచుతుంది
ఆటే జీవితమయ్యే అంకం నుంచి ..
జీవితమే ఆటయ్యే మజిలీ మొదలౌతుంది.
ఆకుల్లో పాటలు పారొలవ్వాల్సింది..

పారొలపుస్తకాలు ఆకుల్లా నలుగుతాయి
మొగ్గల్ని పూవులవ్వనివ్వని మొరటుతనాన్ని నాగరికత నేర్పుతుంది
బొమ్మల స్థానాన్ని వాహనాలు భర్తీ చేసినప్పుడు..
రోడ్డున పడ్డట్టుంటుంది
బొంగరపు జీవితాలు కొత్తపుంతలెక్కవు..
చేసిందే చేయడం ఇప్పుడో లెక్క
లోటు భర్తీ కార్యక్రమాలు జతకడతాయి..
గోప్యతకు పట్టం కడతారు పిల్లలు
గోడచాటునో సందుచివరో కళ్ళు కలుస్తాయ్
రాహుకాలం పొంచిచూస్తుంది
ఓ దుర్ముహూర్తంలో
బెదిరింపులో బుజ్జగింపులో లొంగదీస్తాయి
మెత్తని మనసులు మనుషుల్ని కోల్పోతాయి
నాణెం గాల్లోకి ఎగురుతుంది (యుక్త వయస్సు స్పందనలకు..)

# హాయి చెయ్యి

మనోడికి మంచి రోజులొచ్చినా
పొరుగువాడు పొరపాటుగా ఏదైనా పోగొట్టుకున్నా
ఇంటికొచ్చినవాడు.. ఓటు కావాలన్నా నోటు కావాలన్నా
మన పిల్లవాడు బాగుండాలని మనసనుకున్నా
గుప్పెడంత మనసు గుప్పెట్లోకి వస్తుంది.
మూసిన వేళ్లు తెరిచేటట్టు నెత్తురు పోటెత్తుతుంది.
అభిమానం అవసరం నాడిని ఆడిస్తాయి.
అసంకల్పితంగా మన చేతిని ముందుకు చాస్తాం
ఇచ్చినట్టు ఇచ్చి తీసేసుకుంటాం
దాన్నే కరచాలనం అంటాం.
చేయి చేయి కలపడం చిన్న పనేం కాదు
ఎదుటి మనిషి ఎవరైనా ఎంతటివారైనా
హాయినవ్వు రువ్వుతూ పెదవి పేరు పలుకుతూ
కన్ను కన్ను కలుపుతూ మనసు ముందుకు ఉరకాలి
కరచాలన అంతరార్థం.. సామజిక సమరసత

ఇలా అనుకున్నామని అంతా గొప్పగా ఉంటే ..మంచిదే
చెయ్యివ్వడం అంటే మాట తప్పడమంటారా!
లోకం పోకడల్లో చెయ్యాడింపుల ఉపయోగం చిలవలు పలవలు
మంచి చెడులు రెండూ ఉంటాయి
వాడుకలో వలువలంత అవసరం విలువలు
నిలబడలేనప్పుడు నిలకడలేనప్పుడూ
ఊరికే touch లోకి వచ్చేయకు
ఇచ్చేవాడి గౌరవాన్ని పెంచేలా ఉండాలి అందుకునే చేయి
ఆ సందర్భంలో ఇద్దరూ సమానమనే ఒప్పంద పత్రం
నీ ముంజేయి
పోటీ పనుల్లో పనిపోటీల్లో క్రీడాస్ఫూర్తిని తెలియజేయి
విశ్వమానవ స్నేహసంకేతం ఈ కరచాలనం
చెప్పేయ్ నాకు నీ చేత్తో వెళ్ళక తప్పదని
మునుపు ఇచ్చిందే తెచ్చి; బదులిచ్చానని

అద్దంలో మనిషిలా నువ్వు నేను, నేను నువ్వు అయ్యేపని
చేయిచాచి ఇవ్వజూపి మనసు కలిపే పని హాయిగొలిపే పని
నువ్వేం చెయ్యగలవో అదే చేయి.. నీ చెయ్యి నాకు ఇచ్చేయ్
పలుకరింత, పలువరింత; వీడుకోలు, వేడుకోలు
అభినందన, అభిశంసన; సమర్ధన, సముద్ధరణ
సందర్భాలు సవాలక్ష అన్నిటికీ ఒకే లెక్క
చేయి చేయి కలుపు అదే నీ గెలుపు
వేయి మాటలు చెప్పలేనిది చేతి చనువు చెబుతుంది
వందమంది చూపలేనిది చేతి అరలో దాగుంది
పెదవి పెగలనివ్వనిది గుప్పెట గుడిలో ఉంది
కంటి చూపు లేకున్నా శాంతి కాంతి పంచుతుంది
ఎదురెదురు మనసులు మధ్య సందిగ్ధతలు ఎన్నున్నా
స్పర్శతో నిస్త్రాణ నడుం విరిగి, శక్తి మార్పిడి అవుతుంది
తొలకరి చినుకుల వలపులలో ఆమని చిగురించినట్టు
ఏనాడో ఇంకిన జల పైకి ఉబికి వచ్చినట్టు
చేయి చేయి కలపడమంటే ఏకత్వం ఐకమత్యం కావడం
కవళిక చెప్పని కథలన్నీ చేయితాకి చెబుతుంది
ఇచ్చే తీరునిబట్టే మనిషి జోరును పట్టే
గట్టిగా ఇస్తే బండోడని వదలకపోతే మొండోడని
వేళ్లను మాత్రం అందిస్తే భద్రతలేమి అని..
‘చచ్చిన చేప‘ చేతి స్పర్శకు చేవలేదని
ఇలా పలురకాలు కరచాలనం ఇంద్రధనసు రంగుల్లా
ఆత్మీయ కరచాలనం అన్నింట్లో అదే రాజ
అందుకున్నా పొందినా పొంగిపొరలేది ఆనందం
చేయి పట్టి నొక్కగానే నాలుక సన్నాయిరాగం పలుకుతుంది
స్పర్శ విద్యుత్తై తాకి వెచ్చదనం ఒళ్ళంతా పాకుతుంది

ఎన్నేళ్ళు గడిచినా వేళ్లతడి స్మృతి సంగీతమై మోగుతుంది
తీయటి తలుపుల్లో తనువు తీగల్లె ఊగుతుంది

అందుకునే ఆప్తునికి ఆస్వాదన స్వానుభవం
తడి ఉంటేనే ఈ యోగం ఎవరికైనా సంభవం (మీకే..)

## ఆధునిక స్వేఛ్ఛ

నచ్చింది చేయడమంటే.. విప్పుకు తిరగడమా!
వచ్చింది చెప్పమంటే.. తలపుల్లో తప్పుల చిట్టా అప్పచెప్పడమా!!
మూలాలు మరచిన మూర్ఖత్వం ఇప్పుడో నాగరికత
కాలాలు మారినా మారని క్రౌర్యం ఈనాటి ఆధునికత
ప్రకృతి ఆరాధన ఇప్పుడో అపవిత్రం
సున్నిత మనస్తత్వం ఓ స్మృతి శకలం
ప్రతీకల్లో కవినీ, కవితలనీ వెతుక్కోవడం గగన సదృశం
అభివ్యక్తి, ఆడతనం నలిగిన రోజుల్లో
అవ్యక్తవేదనా అంతర్మథనం మొరటు శృంగారం
కట్టుబొట్లను తెంచేది కవిత్వమన్న భ్రాంతి ప్లేటో కాలానిది
భావోద్వేగ బంధనాల నుంచి బయల్పడడమే ఇప్పటి వ్యక్తీకరణ
భాషను కాదు.. మనసును సంస్కరించుకోవాలి
మనిషితనాన్ని మనమధ్య మిగుల్చుకోవాలి.
తడి ఆవిరయ్యాకా మిగిలేది..విశ్వమంతా.. స్వేఛ్ఛే..
పూడాలిన శూన్యమే

## విషాదానికి ఓదార్పు

నిన్నా రేపు నడిమిట్టా ఎందుకొచ్చావ్ మళ్ళా?
పొలంలోని పంటబోదె నీరెత్తినట్టు..
గుండెకోతల జ్ఞాపకాలు తొలిపొద్దు నీరెండలా  తొంగిచూస్తున్నట్టు..
మొన్నటి తొలకరి మింటిధార తీపిని
కంటి చారల ఉప్పదనంలో కలిపేస్తున్నట్టు
తెలిసిన ముఖమేగా! ఎందుకు చిన్నబుచ్చుతావ్ మళ్లీ?
అవసరమొచ్చినపుడే.. అపుడెపుడో శైశవంలో చిగురించావ్
బాధల్ని మోసే శక్తి నిచ్చి..‘ఈ ఏడుపొకటి’.. అనిపించావ్
చిన్నదైందని.. చిరగని చొక్కాని వదిలేస్తున్నప్పుడు..
జీవితం ముందుకి తోస్తున్నప్పుడు.. ఆశల తీరానికై బతుకునావ
ఆకలి కడలి కడుపుని కోస్తున్నప్పుడు.. ఎదుగుతున్న గుర్తుగా
కనీకనిపించని చేతివంపు వళుల్లాగ అనిపించావ్.
ఆలోచనల చలనంలో చేయి కలిపే ఆగంతుకుడివి
ఒంటరి మననంలో తోడుండే అనుయాయివి..అన్నిమార్లూ
కన్నీరై కదలనంతమాత్రాన  నా నవ్వులో నువు లేవన్నానా!!

## భావోద్వేగం

ప్రశాంత సాగరం పై ఎగసిపడే అల
నీలాకాశం పై కమ్ముకొచ్చే మేఘమాల
గాలి కెరటాల పోరాటంలో ఆకాశాన్ని కమ్మాలని ..
తీరం తాకే కెరటాన్ని తట్టి లేపితే
కడలి కల్లోలం.. మనకు ప్రమాదం
మిన్ను మన్ను నడుమ
గాలి మీటే ధారాతంత్రుల సంగీతం పుడమికి ప్రమోదం
అలనైనా జడినైనా అలజడి చేసే గాలి
సుఖ దుఃఖాల లోగిలిలో దోబూచులాడుతుంది.
స్పందించే మనసును బంధించి బాధించే కారకం
గాలివాటు కాదు.
భయం, బాధ, కోపం, సంతోషం,
ప్రేమ, ద్వేషం అలవాటుగా రావు.
ఉత్ప్రేరకాల సహచర్యంలో ఎగసిపడేవి మన అనుభూతులే
అందీఅందని ఆత్మానుభవాలే.

## నివేదన

దారులు వేరై.. యుగాలు దాటినా.. నిన్ననే కలసినట్టుగా ఉంది.
జ్ఞాపకాల సంధ్యలలోనే నా మనం ఊసులాడుకున్నది..?
చేయి కలిపి నడిచామన్న మాటేగాని..
నా మూలాల మట్టి వేరై.. దిగబడిపోయా..
నువ్ చిటారు కొమ్మల లేచిగుళ్ళను
నిమురుతూ ఉండిపోయావ్ .
ఎండల్లో ఊగిసలాడే నిను చల్లబరచే నీరవ్వాలనే కదా
నే మొదల్లోనే ఇంకిపోయా ..
నువ్ తారపథం లోకి దూసుకుపోయావ్.
రాత్రిళ్ళు నిను చూడ వస్తే గాలి కెరటాల సంగీతమై పలుకరిస్తావ్.
మనమిద్దరం వేణువు రంధ్రాల్లా విడివిడి గా
ఎందుకుండిపోయాం?
నా ఒంటరితనంలో పాటై వినిపించావే!!
కంటి పాపవై ఎప్పుడు కనిపిస్తావో..!!

# వరదై పారాల్సిందే

ఆఫీసర్ ఉరిమిందానికి చుట్టూ ఉన్న వాళ్ల నవ్వుల మెరపులు
గుచ్చుకుని మోహం మంగళం అయ్యింది.
ఆలోచన వడగళ్ల వానలో మంచుముక్కల్లాంటి మెమోల భయం..
కెరీర్-గ్రాఫ్ పై కమ్ముకున్న నిరాశల మేఘమైంది.
జీవితపు జారుడు బల్ల పై
నా కెప్పుడూ ఎదురు దేకుతున్న ప్రయాసే..
తప్పైన ఫైళ్ల చిట్టా లెక్కల చిక్కుముళ్లు
ఏనాటికైనా వీడతాయి కానీ..
నెలవారీ ఖర్చుల తగ్గింపు సూత్రం అంతు చిక్కదు.
అయినా క్రెడిట్ కార్డ్‌ల వాడకంలో నా అహం తగ్గదు.

పెళ్లాం-బిడ్డల కోసమే పురుష లక్షణంలో పదిలంగా ఉన్నానని
నేనూ .. ఏక్ నిరంజన్ గాడైతే ఇంతవరకూ ఆగే వాళ్లమా అని
బాసూ ..ఆఫీసులోనే మిమ్మల్ని అనవసరంగా తలచుకొంటాం.
పొడారిపోయిన మనసులో ఆవేశపు జడి..

ఎడారో ఎండమావో తేలని మజిలీలో
నిరంతర అలజడి ..
కానీ ఆఫీసు అప్రకటిత వర్షచ్ఛాయా ప్రాంతమే ..
ఇంటికి వచ్చేదారిలో జీవనావసరాలు
కుంగిన భుజాన బరువుల్ని పెంచుతాయి.
కొన్న సరకుల మోత ..
గమ్యం చేరాకా తలుపు తట్టటంలో
వినపడుతుంది.
చేయి లానే గుండె కూడా బరువు దించుకోవాలంటే
ఇంటిపట్టున మనిషి వరదై పారాల్సిందే .

ఆనందమైనా ఆవేశమైనా
కనులింట చెలియలికట్ట దాటాల్సిందే..
(ప్రజాస్వామ్య కుటుంబ వ్యవస్థకు..)

# ఓ రైలు ప్రయాణం

ఇష్టం లేని ప్రయాణాన్ని
కష్టంగా చేయించడానికి రైలొస్తుంది స్టేషన్లోకి ..
పెదాల పట్టాలను బిగబట్టి..వేగమంత వేవిళ్ళతో..
ప్రసవార్థమై ముక్కుతున్న పూర్ణ గర్భిణిలా ..
ఇష్టం లేని ప్రయాణాన్ని
కష్టంగా చేయించడానికి రైలొస్తుంది స్టేషన్లోకి
అనుబంధం ఏ నాటిదైనా ఆగేది ఐదు క్షణాలంటూ.. రేకెత్తిన
ఆలోచనలనూ.. రైలెక్కించడానికి .. ఇష్టం లేని ప్రయాణాన్ని
కష్టంగా చేయించడానికి రైలొస్తుంది స్టేషన్లోకి
నాకు ఊరు ఒదలలాలంటే..
తల్లిని వదిలే చంటోడి కున్నంత బాధ
నా ఏడుపు కేక కోసం ఆనందంగా ఎదురు చూసిన తండ్రిలా నను
పట్నం పంపే కిటికీ కరచాలనాల సంఘం
తెగవలసినదని తెలిసినా.. తోడొచ్చే తల్లి పేగులా ..చిన్న నాటి నుండి
పెనవేసుకున్న స్నేహ బంధం ..

ముందుకు సాగే రైలుకి ఉన్న వెనక్కి తిరిగే చక్రల్లా.. నను
సాగనంపుతాయి .. ఏడుపో రాగమో తెలియకుండానే..
రైలు.. నేను.. ముందుకు సాగుతాం.
కంపార్ట్ మెంట్ లైట్ల వెలుగులో కదిలే కాలువ
ఆగిన రైలనిపిస్తుంది
నాకది.. చెలియలికట్ట దాటీ దాటని
చెలి కంటి చెలమను తలపిస్తుంది.
దూరమౌతున్న ఊరులా పలచనౌతున్న
సిమెంట్ బెంచీ సింహావలోకనాలు ..
ఎదురొచ్చే మరో రైలు రొదలో ఉలికిపాటు పడుతుంటాయి.
ఆ సమయానికి ముందు స్టేషన్లో
మైకో- గంటో అప్రమత్తమౌతుంది
రైలింజను నిట్టూర్పులతో బరువు దించుకుంటాయి.. బెంచీలన్నీ
బరువెక్కిన మనుషులను ఎత్తుకున్న బోగీలు పట్టాలను కరుస్తూ..
ఇష్టం లేని పెనిమిటితో కాపురానికా..! అన్నట్లు ..
కష్టంగా ప్రయాణాన్ని చేయించడానికి ..
రైలెళ్తోంది మళ్ళీ చీకట్లోకి.. (నాటి మాట..)

# చతుర్థ చంద్రోదయం

చిన్ననాడెప్పుడో చంద్రుడ్ని చేరువగా చూసిన జ్ఞాపకం..
బహుశా అమ్మ చూపుడి వేలి చివర వేలాడుతూ అనుకుంటా.
అప్పట్లో ఎంత అందంగా ఉండేవాడు !
పంచదార కలిపిన పెరుగన్నం ముద్దలా.
అదేంటో నే ఏడుపు ఆపేలోపు అమ్మ గోటపై చేరేవాడు..
చల్లగ నా కడుపులోకి జారేవాడు.. నే నిద్దరోయాక
నాన్న వచ్చేవాడు.. నింగికి.. నేలకు నడి మబ్బులా ..
ఎక్కువగా గర్జించేవాడు .. అప్పుడప్పుడూ.. పన్నీటి మేఘమై
వర్షించే వాడు .. అమ్మ వెన్నెలంతా నాన్నకే సొంతం.
ఏ అమృత సాగర మథన ఫలితమో..
మా ఇంట శశి వదన ఉదయం ..
చిన్నప్పుడెప్పుడో చంద్రుణ్ణి ఏడుస్తూ చూసిన జ్ఞాపకం
బహుశా అమ్మ అద్దాల నడుమ ననుకుంటా..
అచ్చంనాలానే ఉండేవాడు ..
నోట్లో పాలపీకతో నా చిన్ననాటి ఫోటోలో లా ..
అల్లరి నాలానే చేసేవాడు ..
పెద్దయ్యాక నాకు తోడొచ్చేవాడు .. నాన్న చేతికి అందొచ్చేవాడు

జ్ఞాపకాల దొంతరలో నలగని నిజం..
తమ్ముడైనా అన్న లాంటి వాడి నైజం .
మునుపెన్నడో చంద్రుడు నను చూసి నవ్విన జ్ఞాపకం ..
నను ముస్తాబించి కూర్చోపెట్టాక ..
అదేంటో.. నే తలెత్తి చూసేలోగా తెరమరుగయ్యాడు..
తెలిమంచు కరిగేలోగా తలపులెన్నో రేపాడు..
అప్పటి వరకు తెలియలేదు ..
ఉదయ చంద్రిక కూడా ఉంటుందని నులివెచ్చగా..
ఎన్ని జన్మల బంధమో .. ఆ సప్తపద బంధం ..
ఆ చలువ రాయిపై అరిగే చందం .. నా జీవన గంధం .

ఇది కృష్ణ పక్షపు అష్టమి లోపు మరో చంద్రునితో
నా అనుబంధం. అష్టమి.. అమావాస్య.. తెలియకుండా ..
రసరాజ్య యుద్ధం .. ఫలితంగా పాడ్యమి పాపడు సిద్ధం .
ఇదీ.. ప్రతీ స్త్రీ కోరుకునే.. చంద్రోదయం.
(అమ్మలందరికీ.. వందనంగా)

## మంచి బహుమతి

నేలమ్మ కు ఇద్దామా మనమూ ఒక బహుమతి ..
బహుమతమై వర్ధిల్లని దీవిస్తూ జగతిని .
ఎందుకొచ్చిన అసహనం! ఏం బావుకుందామని ?
ఆడ-ఈడ దాడు లేమి?
ఓటి కుండ బతుకులాయె వేటగాళ్ల తల్లీ.

నువు పంచిన ప్రేమేనా! కొంప ముంచింది!!
మగ నలుపై విర్ర వీగి ఇంత వరకు తెచ్చింది .
కన్న పేగు తెగి పోయి కారుణ్యం కరిగి పోయి ..
మరణానికే ఋణ మంటూ అనుబంధాలను కడతేర్చింది.
మంచోళ్ళకు నూక లేదు నేల మీద .. ఓ చెల్లీ!!
ఎన్ని సార్లు ఈ ఓటమి నా తల్లీ ..
మోసపోయి ఒకసారి.. నువ్వు పోయి ఒకసారి..
కన్నవారిని కోల్పోయి .. ఎన్ని సార్లు! ఎన్ని సార్లు!!
ఎన్ని సార్లు ఈ ఘోరం..? ఎందుకింత కార్పణ్యం ?

కలిసి నీ నీడ లోన మసులుకున్నందుకా?
కసి పట్టి కడతేర్చావు మళ్ళీ. మళ్ళీ..

నువు పంచిన మంచినే మేమంతా మరిచాం.
వంచనే మా మతమని నిరంతరం జపించాం
నీ బుద్ధులు ఆ సుద్దులు నిలుపుకునిన మగవాడు
కాడెపుడూ నీ బిడ్డకు పగవాడు .

దీవించూ ఓ తల్లీ !
నీ సహనం రావాలని సమ్మమం కావాలని
అదేలే మేమిచ్చే మా మంచి బహుమతి

(ఓ ఉన్మాది ఘాతుకానికి తల్లిదండ్రులను పోగొట్టుకున్న అమ్మాయికి..)

# వెలుగు చూద్దాం

మేం చూస్తాం.. చూసి తీరతాం
ఏ రోజుకై ఎదురు చూశామో ..ఇంతకాలం మనం!!
65 ఏళ్ల కింద వచ్చినట్టు విన్న రోజుని..
పెద్దల పెదాలపై పదే పదే పలికిన రోజుని..
చీకటి వాకిట్లోకి వెలుగై చిమ్మే రోజుని ..
మేం చూస్తాం.. చూసి తీరతాం
ఇక ఏ రాజకీయ మైనాకమైనా సముద్రంలో దూక వలసిందే.
సగటు మనిషి అడుగుల సవ్వడిలో
మిన్ను ..మన్ను కంపించ వలసిందే
పాలకుల బిరుసు తలల పై పిడిగులు పడే రోజుని
మేం చూస్తాం చూసి తీరతాం
నిజం అంత నిజంగా విజయం .. నిలిచే రోజుని
తరమబడ్డ నమ్మకాన్ని పీఠమెక్కించే రోజుని

ఖద్దరు ముసుగుల లొసుగులు
తొలగి పోయే క్షణాలు .. తారాడే రోజుని
మేం చూస్తాం చూసి తీరతాం.
కోరుకున్న రోజ ఎదురొచ్చినప్పుడు
దారి చూపే సహచరులతో కలసి
మనం కాక మరెవ్వరన్న జవాబు
ఇప్పుడు కాక మరెప్పుడన్న స్ఫూర్తితో నడచి
నాలో నేనై ప్రభవించి..
మానవతై గుబాళించే స్వతంత్ర పుష్పాన్ని
చూస్తాం చూసి తీరతాం.
సామాన్యుడి బతుకు బండి గతుకుల దారి.. పూల బాటైన రోజుని..
రోజువారీ పనిలో అలసట ఆట పాటైన రోజుని..
మేం చూస్తాం చూసి తీరతాం (సహచరులందరికీ..)

# కొన్ని Tellగు మాటలు

ఉలి రాల్చిన శిలాక్షరాల రజను ఓ యుగాదిన పోగేస్తున్నాడొకడు.
తవ్వకాల పునాదుల్లోంచి అంతర్వాహినిని వెలికితీస్తున్నాడతడు.
ప్లవకాల ప్రవాహంలో కొట్టుకుపోతున్న ఆత్మబంధాన్ని ప్రోది
చేసుకుంటున్నట్టుగా .. తన దోసిలినిండా జవ జవ లాడే
తెలుగుదనం జాలువారుతోంది. ఉలి రాతల సమానర్థకమే..
నా మనసు భాషలోకి మారుతుంది.
సమీప గతం ఛాయలా నా తలపుల్లోకి జారుతుంది.
ఆ ఉషోదయపు అన్వేషికి అందిన శకలాల కొన వెలుగుల్లో
చరిత్ర చెక్కిన శిల ముభావమై మసక బారుతోంది.
వాడి మాటల్లోని నిజం.. భాషను మించిన భావమై నిలుస్తోంది.
ముంగిలి రంగవల్లుల్లో ఆహ్వానాల తోరణం ఇంగ్లీషు రూలైనట్టు
ఆంధ్రత్వాన్ని హరించింది.. రంగుల పేర్లు భాష మార్చు కున్నాయి.
రంగును కలర్ ఆవహించింది. చెక్కిళ్ల పై ఎండిన చారలా
చందమామ మూనై వలితిరిగాడు
అమ్మా నాన్నలకు లేని అస్తిత్వం జాబిల్లికెక్కడిది?

విద్యాలయాలు పిడిదీక్షాలయాలవుతున్నప్పుడు
కవితాపాఠం లాంటి చదువు..కంఠోపాఠం అవ్వచ్చు గానీ
హృదయగతమౌతుందా!! తినే అన్నం, తాగే నీరు, పీల్చే గాలి,
నడిపే వాహనం, రాసే కలం, కాగితం.. మనసు భాష లోంచి
రావడం ఇప్పుడో ప్రహసనం. మన మూలాల్లో మనమెంతన్నది ఒక
ప్రహేళిక.. ఆసుపత్రులూ.. తువ్వాళ్లు, కుర్చీలతో చిక్కులు లేవు కానీ
పోత పాల పెంపకాలలో పెట్టే పేర్లన్నీ పొల్లుపోనివే..
అజంతంగాఉండలేని నామం పొల్లుతో నేమవుతుంది.
సాధారణంగా జరిగే కామనే.. లోకం లో నిలవ్ నివ్వనివి
ప్రేమ భావనలు. పొరపాటైనా కాకున్నా.. ప్రతి సారీ నిముష
కాలమినిట్టే గడిపినట్టు ఒకే ఒక అవగతం.
జీవితం ఒక పాటైతే అది సాంగోపాంగమే..
అర్థం కాని పదబంధాల గజిబిజి ని
తీరికలేని తనంగా పోగేసిన వాడి కెంత గీర్వాణం!!!
వాడి దోసిలి నిండిన మల్లెల్ని మొనల్లా కన్న నాదెంత చత్వారం!!

# నాతో ఆడవా..!

రాత్రి రహస్యాలు రసవత్తరంగా వుండవ్
తెల్లారితే మాటల తూటాలు రోజుకి ఎన్నిసార్లు పేలతాయో..
రెండు వైపులా తిట్ల గుళ్ల పెట్టెలు అక్షయ పాత్రలే
ఖండాంతర క్షిపణుల్లా పెళ్ళి పెద్దల పైకి పరోక్ష ప్రయోగాలు
కళ్లలో కంఠంలో జీర.. మనో విస్ఫోట అవశేషంగా ..
మదిలో కరెంటుండదు మాటల మధ్య మనుషులుండరు
చెలగాటాల కాపురాల్లో రాగం శృతి మించితే
వస్తువులపై అరుస్తూనో కన్నీళ్లకు తడుస్తూనో..
భరించడం వల్ల కాదన్నది ఇరువైపులా సాకు..
వేర్పాటు వాదం చెయ్యెత్తితే .. గుమ్మం దాటే మంతనాలు
ఒప్పందాలన్నీ చట్టుబండలే.. మధ్యవర్తిత్వం మాటచెల్లదు.
ఎవరో ఒకరు న్యాయ దేవత నిద్రను మళ్లా చెడగొడతారు
కసి మనుషుల పంతాలు పసిమనసుల కేరింతలు..
నెలకోసారి కోర్టు హాల్లో..

అమ్మ తోడుగా ఎడబిడ్డ అన్నకు కనిపించేది అక్కడే..
రాజీ లేనమ్మా, రుషి పుంగవుడూ పొరపొచ్చాల ప్రపంచంలో
ఆటల్లో సహోదరుల కేరింతలు.. సినిమా చూసినంత సేపే
కేసుల్లో పైచేయికై అమ్మానాన్నల కుస్తీలు,
కలిపే ముసుగుల్లో విడదీసే నల్ల కోట్లు
పిల్లల జీవితాల్తో పెద్దల చెలగాటాలు
బండెడు పుస్తకాల్లో ప్రశ్నలు ఇప్పుడు పెద్దగా బాధించవ్
వెలితిని నింపే స్నేహం కోసం.. గుండె చెరువయ్యే మాట
రోజూ బడి చివరి గంట మోగాకా.. చిన్నారి గుండె ప్రకంపనలు..

ఎన్నిసార్లు అంటాడో.. ఇంకెన్నిసార్లు అనాలని అనుకుంటాడో
తమ్ముడు కూడా లేడు.. . రావా మా ఇంటికి ..నాతో.. ఆడవా!!
(ఓ చిన్నారి స్నేహితునికి..; ఓ స్నేహితుని చిన్నారికి )

# మేలు తలపు

ఎపుడో ఒకమాటు వస్తుందో మంచి మాట స్వచ్ఛమైన తలపుల్లో..
స్మరించే మాటల్లో ఒకానొక మంచి
అయినా కాకున్నా అందరికీ ఆమోదం
వస్తుంది మది లోకి ఎపుడో ఒకమాటు
అందిన సాయం గుర్తుగా చేసిన మేలు తలిస్తే..ఎదురుగా
మెచ్చుకోలు అందుతుంది ప్రీతిగా.. ఎన్నడు మరువరు నిన్ను.
హాయిని గొలిపిన పిమ్మట.. అది మంచిని పంచే ప్రేరణ.
ఉపకారికి అభినందన.. రాత పూర్వకమైనా
హావభావ యుతమైనా.. ఫోను పలకరింపైనా
స్వయం మనవి చేసుకున్నా..
సాయం పొందేందుకు వారధి అది.
అభినందన అందనపుడు..
తిరిగి సాయం తలవకపోవడం సహజం
ఇది కొండకొచో గ్రహించే వివరం

సహజంగా మంచోళ్లే మనిషన్నవాడెవడైనా
సాయం చేస్తారు, చేతిని అందిస్తారు, సహకరిస్తారు
నడిపిస్తారు.. మంచి దారికి మళ్లిస్తారు
ఆ గుర్తింపుకే పెద్దెత్తున ఆనందిస్తారు
కృతజ్ఞతలు అందుకున్నా, ప్రశంసలు పొందినా
ప్రేమతో స్వీకరిస్తారు గుర్తింపుకి పరవశిస్తారు
స్వంత లాభపు ఊసుతేని; స్వార్థ పరత జాడలేని
మంచితనమే మర్మమిందులో
మన మెచ్చుకోలే లోకహితానికి ఊతం
నడుం బిగించే అవకాశాల నిచ్చెన
ఇతరుల్ని ప్రేరేపించే కారకం
జీవితాన్ని అనంతంగా తేలిక పరచుకునే
చక్కని-చిక్కని అవకాశం

(ఈనాడు జర్నలిజం స్కూలు ప్రిన్సిపల్- నాగేశ్వరరావు గారి మాటల మంత్రాలకు ముగ్ధుణ్నై..)

# ప్రేమకు మచ్చ- నీ ఊసు

ఏడుపొస్తుంది సైదుబాబూ!
నీ చావు తెలివితేటలకి.. బతక నేరవా!
బలవంతపు చావులోన నీవలపు బలిపశువా!!
ఆరు సెప్టెంబరు పేపరులో శివకాశీ చావుల హోరు.
రక్షించబోయి ఆర్తుల్ని.. చనిపోయారట పాపం
తెగువచూపి కొందరు.. చావంటే అదిరా...
భగవంతుడి కొలువులోన.. (ఛఛ.. రాలేనివాడి మాటెందుకు!!)
మనుషులనే జాతిలోన.. దయాళువుకే విలువరా.
నిర్దయుడా..! ప్రేమంటే ఏమిటో..
దారులు వేరై విడివడినా.. కలసిమోగే గుండెల సమశ్రుతి నడుగు
ఎదురీతలో తడబడినా బతుకు నావ నడిపించే
విడిజంటలనడుగు ప్రేమంటే ఏమిటో..
చితిమంటల నివురు కింద దేవులాడ.. దొరికిన అస్థిక
చేరినచేతిలో చిందిన.. కన్నీటి గంగ నడుగు
పగతోడుగా నువు చిదిమితే దీపం ఆరిన ఇంటిలో..
నువు గుచ్చిన గునపం..అది చీల్చిన కడుపున సుళ్ళుతిరిగే వేదన;
కారుణ్యం నేర్పలేని నీ చదువెందుకు! చావెందుకు!!

నువు చేసిన దారుణానికి ప్రేమకాదు కారణం
ప్రేమిస్తే.. మనసిస్తాం జీవిస్తాం .. మనిషిగా చస్తాం

ప్రేమంటే..
తనకు తానుగా జీవితానికి అర్పించే నివేదన
బతుకు బాటలో పంచుకునే ఆవేదన
మనిషితనాన్ని ప్రోదిచేసే అత్మశోధన
బతికి బతికించుకోవడానికై సాధన
పూసే పువ్వులో, విరిసే నవ్వులో
జీవన సౌందర్యాన్ని దర్శించే ఆరాధన
అనుకున్నవన్నీ జరిగితే అది జీవితమే కాదు.
ప్రేమించే మనసుంటే..
అలోచనలు అణ్వాయుధాలుగా ఎన్నటికీ మారవు.
ఆమాత్రం తెలుసుంటే..ఇన్ని గుండెలవిసేవి కావు
మాయదారి కసి ముసుగా! ప్రేమకు మచ్చ నీ ఊసు
అది మనుషులపై నమ్మకాన్ని కాల్చే కార్చిచ్చు..
(5.9.12 న ఈనాడు గుంటూరు జిల్లా పత్రిక చదివి.. కన్నీళ్లతో)

## ఉడాతా.. నీకూ- నాకూ తేడా

రాములోరి వారధికి రాళ్లెత్తిన ఉడతా
ఎందుకే నీకంత డాబు భక్తి ముసుగా నీ వెనకా!!
సమర్థుడు సాహసి వాడు అని నువ్వారుకున్నావా
కోతులతో పాటూ నాకూ ఉందని తోక ఊపుతూ వెళ్ళావా!!

ధర్మరాజ యాగంలోన కథలు చెప్ప వచ్చావంటా
రంతిదేవుని దాతృత్వం రంగు పూసి వల్లించావా!
రాముడు నిమరిన వేళ్ళ చారలైనా వంటి మేలిమి మిసమిసైనా
నీ మూతి విరుపో, వంటి తీరునో చూపడమేలే ఆంతర్యం

పుట్టి కన్ను తెరవడానికి నీకు 40 రోజులెందుకో
నిద్రానంతర ఊర్మిళలా రంగు తిరగడానికా!
యువరాణి లేఖ రాయలన్నా.. ప్రియుడు బొమ్మ గీయాలన్నా..
నీ తోక పీకి వాడాలనే పితలాటకం పెట్టిందెవరో
నాజూకైన దేహం.. గుబురుబొచ్చు తోకా.. చారడేసి కళ్ళూ

ఏ సౌందర్యరాశి నీసాటి! స్వేచ్ఛాజీవివి నీకేది పోటీ!!
నువ్వు లేని ఊరు లేదు; నీ అందం చూడని కళ్ళు లేవు
చేతిలో పండో -గింజో ఉంటేనే నావైపు నువ్వొస్తావా!!

ఆడపిల్లల్లా మెరిపిస్తావ్.. మురిపిస్తావ్.. వెక్కిరిస్తావ్..
మొగపిల్లల్లా గంతులేస్తావ్.. భయం వదిలి పరుగులు తీస్తావ్
ఎండకాసినా ..వాన వచ్చినా.. తోక గొడుగులో దాక్కుంటావ్
ముందు జాగ్రత్తతో ఉన్నట్టుంటావ్.. పట్టుకుంటే కరుస్తావ్

చటుక్కున కనిపించి పుటుక్కున జారుకుంటావ్
మాకూ నీకూ తేడా నీ సున్నితత్వం
పువ్వులని వాసన చూసినా తెంపకుండ వదిలేస్తావ్
నువ్ చనిపోయినా.. బొమ్మలానైనా పనికొస్తావ్;
మాకన్నా గొప్పగా నిలిచివుంటావ్.
( జీవ వైవిధ్య సదస్సుల నేపథ్యంలో★..౧)

# పిచ్చుకా.. ఓ పిచ్చుకా!

ఎన్ని కథలు విన్నాం అమ్మ ముద్దుల మధ్య
వసారాలో  నీకై కట్టిన వరికంకిల్ని ఎక్కి
ఎన్ని పెరుగన్నం ముద్దలు తినిపించావ్
కుండ మూతలో పోసిన నీళ్లు నువ్ తాగినప్పుడల్లా
నే కొట్టిన కేరింతలు ఎన్నెన్నో

నువ్ తుర్రుమన్నప్పుడు నే కేర్ మన్నానో
నే కేర్ మన్నప్పుడు నువ్ తుర్రుమన్నావో
నువ్వెప్పుడు ఎక్కడ ఉంటావో
గాలి లేని గదుల్లో ఎలా ఎగిరావో
ఫాను కిర్రు ఆగితే కిటికీలోనూ నువ్వే
కుదురులేని పిట్టా!! నీ పేరే తుందురు పిచ్చుక..
అవసరాల వారి పొట్టిపిచ్చుకవో..
ఆస్కార్‌వైల్డ్ హ్యాపీప్రిన్స్ నేస్తానివో
ఎన్నికథల్లో తిప్పావు నన్ను!!
అందమైన తలపుల్లో నువ్ కనిపించని ఆత్రానివి
ఒకటి రెండు కబుర్లు నీవి నలుగురితో చెప్పుకోనా

౧.

అనగనగా ఒక రైతు ఇల్లు.. తడుస్తూ చలికాలపు రాత్రివేళ
కిటికీ లో పిచ్చుకలు జంటలు జంటలుగా జడుస్తూ
జాలిగుండె రైతన్న గడ్డి పరచి.. మిమ్ము పిలిచి
ఎన్ని చేసినా మీరు లోపలికి రారాయే గింజలేసినా తినరాయే!

ఇంతలోన వెలిగిందీ ఆలోచన..
తాను కూడ పక్షైతే దొరికెనా ఓ దారి అని
అర్థంకాని తనపు ఈ సందు పూడేది లే.
అయినా తెలిసింది ఓ దేవ రహస్యం
దేవుడెందుకు మానవుడై మన మధ్యకు వచ్చాడో అప్పుడు.
మనిషి మనసేంటో.. మనిషి రూపంలో ఉన్నవాడికైనా
తెలుస్తుందేమో అని..

౨

అనగనగా ఓ బుర్రు పిచ్చుక పడింది మనిషి ఉచ్చులో
ఏమిచేస్తాడో చేసింది వాకబు .. తిండికి సిద్ధం అన్నాడు
వేలెడు లేని పిట్టను నేను. ఆకలి తీరే తీరు లేదు

వదులితే చెబుతా.. జీవిత సత్యాలు చేతిలో ఒకటి; చెట్టున రెండు
అంటూ చెప్పింది సూత్రం ఒకటి:
మనకు నచ్చింది పోయినా
వెళ్ళిపోయినా పోనీ మర్చిపో ఏదో ఓ రోజు ప్రతీదీ పోయేదే
వదలడా మరి అంత చెప్పాకా!!
మంచి మాట ఒక బతుకు విలువ
ఎగిరి.. పిట్ట అరిచిందిలా "అసాధ్యపు పనులౌతాయన్న అసత్యాన్ని
నమ్మకు.."
చెట్టుమీద వాలి అంది "నను చంపితే దొరికేది మణుగుడు
బంగారం కడుపులో మరి"
నిరాశతో అడిగాడు మూడో సూత్రం ముందు చెప్పమని..

కిచ కిచలాడిన పిచ్చుక ఇప్పుడు దెప్పింది
"మొదటి రెండూ మరచినోడికి మూడోది ఎలా ఉపయోగం!!"
పిడికెడు లేని పిట్టపొట్టలో మణుగుడు పుత్తడి ఉండేదెలా??
చేతిలో లేని పిట్ట ఎక్కడుంటే ఏం!!
పోతే పోనీ.. మనదేదీ పోలేదుగా!!
(★..౨,3)

## నల్కిస్.. నల్కిస్..

నలికిరప్ప నలికిరప్ప.. నావైపు రాకు.. నా పేరు.. నాగప్ప
నల్కిస్ నల్కిస్ నాపేరు రాందాస్
నన్ను చూడమాకు.. నావైపు రాకు
నువ్  పాడించిన పాట కదా!
గుంటూరైనా.. గురజాలైనా కనిపించేవు ఆనాడు.
గుడుగుడు కుంచంలా తలపుల్లోనే మిగిలావు
నువ్వొదితే బిందెడుపాలు తాగాలనడం
ఆ నాటి మాకవిత్వం కాదా! తెలంగాణాలో పాలబిందె,
నడుకుడి పింజ; రాయల సీమలో నలికిరప్ప, పల్నాడులో నల్కిస్,
ఉత్తరాంధ్రలో బిందె పాము.. ఎన్ని పేర్లున్నాయ్ నీకు
నలికిరి పామూ!! కనిపిస్తే పారిపోయే నీకు మేమేమి చేసాము?
కనపడకుండా పోయావు!!
ఏ ముంగీస తినేసిందో.. మా తలపులని..
ఉడతా, పిచ్చుకలతో పాటు కనుమరుగైపోయావు..
జీవ వైవిధ్య సదస్సుల్లో
కనీసం మావాళ్ళకు బొమ్మగానైనా గుర్తొచ్చావా!
మా చిన్నారి తరానికి అందమైనా జుగుప్సగానైనా తలపిస్తావా!!

## ఓ సరదా దండకం.. సీరియస్ గా

శ్రీమన్మహారాజ విఘ్నేశ్వరా నిన్ను ఈరీతి పూజింప ఓ రోజు ఉంటుందనీ నాకెపుడు ఊహన్ కూడ ఆలోచన లేదు కానీ రేపు నీదు బర్త్ డే అని అందరున్ చేస్తున్న హడావిడిన్ నే చూస్తున్న.. నిన్నున్ పెద్ద పెద్ద రూపాల విగ్రహాలన్ ఏర్పాటు చేసి లారీలు ఆటోల కెక్కించి రోడ్లుపై తారాడు బుడతలన్ పెద్దలన్ చూసి, రాయాలని బుద్ధిపుట్టి చందస్సు లేకుండా రాసేటి ఈ పిచ్చిరాతను  భక్తితో వినమని కోరెదన్ హలో వినాయకా!.. ఓ పెద్ద బొజ్జయ్యా! ఓ సున్నపు ముద్దయ్య ప్రకృతిన్ పాడు సేయ నీ బొమ్మ చేశాము గొప్ప రంగులేశాము జై జై వినాయకా జై గణేశ అని ఎంత పొగడినన్ వేడినన్ ఈ లోకంబునందు నీవు చేయ పనుల్లో మిగిలుందిలే హుస్సేను సాగరును అందులో నీటిని బాగు చేయడం తీరిగ్గ నీ తలను ఆంచీ, నీ కాళ్ళను ఒళ్ళును బొజ్జనూ ముంచిఉన్న నిను గాంచితిన్ ఒక్క లడ్డును తప్ప నీవు ముల్లంగ చూసినా చేసినా పుణ్యమటుంచు పర్లేదు గానీ నీ తోటి హుస్సేను సాగరున నీటిలో పొరపాట్న కాలుగాని పెట్టినా వచ్చు దురదలన్ పోగొట్ట నా డబ్బులున్ చాలక ఉన్న జబ్బును వదుల్చుకోలేక నిను వేడ వచ్చితిన్ నా కాలు గోకినన్ తిక్క తీర తొక్కూడి బొబ్బొచ్చి పుండై నా కాలు నాది కానటుల అనిపించిన పరిస్థితిన్ పక్కనన్ పెడితేన్, నిన్నూహించ నవ్వొచ్చె నాకున్ చేతులేమాత్రం ఖాళీగ లేకుండ నిన్నటుల వీక్షించి.. నా స్థితియే బాగని భావించి; నువ్వెటుల గోక్కుందువో.. నీ కష్టముల్ తీర్చ కైలాస వైద్యుడెవ్వడని చింతించ తలచితిన్ చూచితిన్ ధన్వంతరిన్ నీదు పూజలో నీ భక్తిలో వైద్యార్థివై నీరాకన్ కానక నీదురదన్ నేరక నీకొక్క టెంకాయనున్ కొట్టి ఉండ్రాళ్ళను పెట్టి ఊహలో సంతోషితం చేసి పరివారమున్,బంధు మిత్రులన్ కూడియుండగా నీ వళ్ళు మండి..నీదురదన్ పెరిగి.. నీ చేతిదంతంబు చేగోకి చూడగా.. ఇది యేదో బాగున్నదనిపించి నువు చేతలున్ పెంచగా నీ పెయ్యి పై పడ్డ గీతలున్ నామాలు గా మారగా.. నీ తండ్రి సంతసింప.. నీ బాధ ఉపశమన మంత్రంబు బోధించి శివున్ నీ మొరాలకించినట్లుగా చేయ.. మాకేది దిక్కు మరి అని అడిగెద నిను.. ఓ వినాయకా! దయతో మము మార్చు.. వచ్చే యేడాదికైనా మేమంతా రంగులన్ మాని అంత పెద్దగా అందునా సాగరునన్ ముంచక నువ్ మట్టివై, చిట్టివై ఆకులో చేతిలో చేరునటుల నీ సైజు తగ్గించి చేయునట్టూ దీవించవయ్యా మహానుభావా పెరటిలో నుయ్యిలో లేద మంచినీటి కుండలో నిను కలిపి నీ ఇంటికిన్ పంపెదన్ ఈ జన్మకూ ఏ జన్మకూ సాగరు జల శుద్ధి నీవల్లను, నీ బాబు వల్లను, మా దొరలవల్లనూ కాదన్నదీ నిశ్చయం. ఈ మురికి గాలుల్లో ఈ కుళ్ళు నీళ్లోల్లో తిరిగేటి ఖర్మ నీకు తప్పాలనీ.. ఓ తండ్రీ! మాకు తప్పని పని యని అనుకుంటూ..  నమస్తే.. నమస్తే నమస్తే నమః

# కొన్ని మెరుస్తుంటాయ్

కొన్ని మెరుస్తుంటాయ్
కొన్ని మురిపిస్తుంటాయ్
కొన్ని మాట్లాడిస్తాయ్..
ఆడిస్తాయ్.. పోట్లాడిస్తాయ్
చూపుల్ని లాక్కుని దోచుకునేవి..
పెదాల్ని.. ముక్కుపుటాల్నీ తెరిపించి మనలో దాక్కునేవి
మెలకువలో తారాడేవి.. ధ్యానంలో వెంటాడేవి కొన్నుంటాయ్
బహుశా అన్నీ ఒకేలా పుట్టి ఉంటాయ్
ఎందుకిలా అని కారణాలు కొన్నింటికి తట్టే ఉంటాయ్
కొన్నైనా అందుకోవాలని నడుంకట్టి ఉంటాయ్
ఒక్కటై వెలగాలని పట్టుబట్టి ఉంటాయ్
అందుకే నలుగురితో జట్టు కట్టి ఉంటాయ్
పుట్టిన ప్రతివాడూ ప్రతీకే పై వాడికి
మనిషి ని కనడానికి కాదు.. మంచిదనం కొలవడానికి
తన మానాన తాను తయారు చెయ్యడానికి
యంత్రం కాదుగా వాడు

అందుకే కుంచె రంగుల్ని చిలకరించినట్టు..
అసలు బొమ్మలే రానట్టు.. వచ్చినా సరిగా దిద్దనట్టూ ..
ఏదో బెట్టు చేసినట్టూ చేస్తుంటాడు.

కొన్ని నవ్వుతున్నట్టూ,
కొన్నిటిపై నవ్వాలి మరి తప్పదని రాసి పెట్టినట్టూ
నవ్విస్తున్నట్టూ కవ్విస్తున్నట్టూ.. చేసి చూపిస్తాడు.
అసలా మాయలోడు ఏం ఆశిస్తాడు!
ఏం ఆశించి మనల్ని ఆడిస్తాడు!!
కొన్ని నవ్వుల్ని రువ్వి కవ్వించి మరీ ఏడిపిస్తాడు
కొందరిని సానపట్టి మెరిపింపజేస్తాడు!
మరికొందరిని తొందరలో ఉన్నట్టు తరిమేస్తాడు
అందరినీ కట్టగట్టినట్టు కనిపిస్తాడు
విడివిడిగా లెక్కగట్టి ఆటలన్ని కట్టిస్తాడు
అందని ఊహల్లో అందర్నీ చుట్టేస్తాడు.
(మనుషుల్లో మాణిక్యం.. అన్నయ్య భాను కిరణ్ ను తలచినపుడల్లా..)

# ఈ క్షణం ఇలా ఆగిపోనీ

ఈ క్షణం ఇలా ఆగి పోనీ
రేగిన గాయాన్ని మాపే కాలంతో జతకట్టలేను
నన్ను తనలో పొదుగుకున్న రాత్రి కరిగిపోతున్న భయం
నీడ చూడాల్సిన వెలుగుజాడలో నేకరగలేను
తెల్లవారితే జీవితం యాంత్రికం
నాలో నేను లేని రోజంతా.. పరిగెత్తలేను
నా నగ్నత్వాన్ని కప్పే నాగరికత ముసుగులో
కృత్రిమ శ్వాసతో బతుకీడ్చలేను
ఈ క్షణం ఇలా ఆగి పోనీ

నన్ను నాలో చూసుకునే అద్దం లాంటి రాత్రి
చీకటి వాకిట్లోని మసక వెలుతురే..
నీకై తపించిన నన్నును నాకు దూరం చేస్తుందన్న దిగులు

గతం లోతుల్లో నేను నా లానే ఉండిఉంటా
నేను నువ్వైయ్యాకా విచ్చిన వెలుగులో నన్నే నేను పోగొట్టుకున్నా.

నిశీధి పంచే చల్లదనం వలపుల వెచ్చదనాన్ని ఏమార్చనీ
నేనంటూ మిగిలుండాలన్న నీ వీడుకోలు వీలునామా

అనుక్షణం నీకై బతకాల్సిన బాధ్యత
ఎందుకింత కాంక్ష నీకు..!
జన్మ జన్మల బంధమా నువ్వే గెలవాలి కానీ
ఈ తిమిర సమరంలో ఈ ఒక్క క్షణం ఇలా ఆగి పోనీ
నన్ను నాలో నిలిచి పోనీ

(మనసు నను తొలచినపుడల్లా..)

## నాకే గనక చేతనైతే

పసిపిల్లల పిప్పర్మెంట్ నౌతా
తీయతీయగ కరిగిపోతా

స్కూలు పిల్లల బ్యాగు నౌతా
పుస్తకాలను మోసిపెడతా

కన్నెపిల్లల కోరికౌతా
కన్నవారి కానుకౌతా

మగపిల్లల మీసమౌతా
తెలుగువాని రోషమౌతా

యుద్ధవీరుని గన్నునౌతా
భరతమాతవెన్నునౌతా

మరుమల్లెల దండనౌతా
దేశభక్తుని దండమౌతా

ఆప్తమిత్రుని దరహాసమౌతా
అనాథకు విలాసమౌతా

ఆర్తురాలికి అన్ననౌతా
నిరుపేదకు అన్నమౌతా

శ్రమజీవికి పాన్పునౌతా
నిండుచూలాలి కాన్పునౌతా

ముసలిఅవ్వకు చేయూతనౌతా
అవసరమైతే కొడుకు నౌతా.

(చిన్నపటి మాట.. ఇప్పటికీ)

## అడ్డాలబ్బాయ్! నీతో కలసిఉన్నప్పుడు..

ఒకే దీపస్థంభం
వెలుగులీనుతుంది మనమధ్య
తీరం నావల బంధం మనది
నువ్వేకడున్నా.. నాదారిన నేను..
తెరచాపెత్తి సాగిపోతా
తారానగరంలో అంతరిక్ష యానంలో
దిక్సూచివై నువ్వున్నప్పుడు
నీ పౌరహిత్యాన్ని వీక్షించాలని
ఉవ్విళ్ళూరుతూ నేను వస్తాను
ఎవరివో అనుమానాల చీకట్లను
చెరిపేస్తూ దారి చూపిస్తుంటావు.

యుద్ధ ప్రాతిపదికన ఆటలాడిస్తుంటావు
మాటలాడిస్తుంటావ్.. పోట్లాడిస్తుంటావ్..

నా స్నేహగంధం నిను చేరినట్టు
ఓ సంకేతం.. నువ్ తలపరికిస్తావ్

నీ గమ్మత్తు కళ్లతో నను తడిమేలోగా
పొద్దురేఖలు నాలో విచ్చుకుంటాయి

నేల మీది తారలు ఆరోజుకి మరుగవ్వగానే
రెండు చంద్రవంకలు మన పెదాలపైన వాలతాయి

అప్పుడప్పుడొచ్చే నీలి పున్నమి ఐనా
నా స్కూటరు నీతో కలిసి
నేల మీదే సాగిపోతుంది
నే గాల్లో తేలిపోతాను.

(ఒకప్పటి కాలేజీ నేస్తం.. ఇప్పటి సినీ దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల
తారానగరం: filmcity వచ్చినప్పుడల్లా.. ఎప్పటిలాగే)

# అక్షరాన్ని.. నేనక్షరాన్ని

అక్షరాన్ని .. నేనక్షరాన్ని ..
శబ్దం నా లక్షణం .. పదే పదే ప్రయోగిస్తే భావం నా లక్ష్యం.
నా లక్షణంతోనే లక్ష్యాన్ని సాధించే మధురక్షణాన్ని.
లక్ష్యం నుండే నా జననం .. లక్ష్యం లోకే నా పయనం ..
అక్షరాన్ని నేనక్షరాన్ని.
విడిగా చూస్తే నా జీవితం అర క్షణం ..
నిఘంటువులలో నా లోతు అహోబిలం
నా పరిధి శత సహస్ర జ్యోతిర్వర్షం.
శబ్దార్థ సర్వస్వమూ నా సాక్షాత్కారం.
అరుణ కిరణపు తీక్షణాన్ని, ధైర్యవంతుల లక్షణాన్ని..
క్షరాన్ని కాదు నేనక్షరాన్ని.. క్షయాన్ని కాదు నేనక్షయాన్ని ..
నా మాతృమూర్తి మాట వెంట నా విలువ అక్షరాలా అక్షర లక్ష .
నా మాతృభూమి పాట వెంట లక్ష అక్షౌహిణీల పై మాటే .
శాఖా గ్రంథాలయాలలో నిక్షిప్తమైన అవక్షేపాన్ని..

నవీన విశ్వవిద్యాలయపు ప్రతి ప్రశాఖలో ..
అలక్ష్యం అవుతున్న అద్భుత నిక్షేపాన్ని.
సాహితీ గవాక్షం నుండి వీక్షిస్తే విరూపాక్షుని విశ్వ రూపాన్ని
నా పూర్వ ప్రాభవం గత జన్మపు మోక్షం.
పద్యపు పల్లకీ కుదుపులకు సన్నబడిన నుడికారపు నడుమును.
నన్నయ నేర్పిన నడకకు.. తిక్కన తీక్ష్ణ నినాదం తోడైతే ..
పోతన పూసిన తేనె పూతను..
శ్రీనాథుని శృంగార నైషధాన్ని నే నక్షరాన్ని .
విశ్వనాథుని కల్పవృక్షం కింద సేదతీరుతూ..
కృష్ణశాస్త్రి మందారమారుతాల్ని ఆస్వాదించేనాటికి
నాది ప్రౌఢ వయస్సు ..
లుప్త శిల్పంమై జవసత్వాలుడిగిన
నాకు తిలోదకాలిచ్చింది తెలుగు త్రిమూర్తులు ..
వారి అంశతో దత్తాత్రేయుని రూపం వచ్చింది నాకు.

శ్రీ శ్రీ రాబందుల రెక్కల చప్పుడుతో నిద్ర లేచా ..
మైలమ భీమన కలల  ఖడ్గ సృష్టి చేశా.
దాశరథి అగ్నిధారనై రుద్రవీణనై వినిపించా ..
సినారె విశ్వంభరలో నక్షత్రాన్నై దారిచూపా .
శేషేంద్రుని శేషజ్యోత్స్ననై ఎర్ర కోరిక కోరా.
ఇప్పుడు ఇప్పుడు..ఇప్పుడునే
ప్రజా విప్లవ ప్రవాహ తాలోత్తాలపు తరంగాగ్రాన్ని..
ప్రజాశక్తులు వహించే విజయ ఐరావతపు ఘీంకారాన్ని
వెన్నెల్లో ఆడుకునే ఓ అందమైన ఆడపిల్ల ప్రతిరూపాన్ని,

అక్షరంలోని అంతరిక్షాన్ని ..
మనోంతఃరిక్షంలోని అక్షర నక్షత్రాన్ని
న్యాయాన్యాయ విచక్షణని ..
విద్యాధికుల విలక్షణాన్ని
అక్షరాన్ని నేనక్షరాన్ని.

ప్రేయసి పెదవులపై ప్రణయ వేదాన్ని..
తాపసి ఉచ్ఛ్వాస నిశ్వాసల ప్రణవ నాదాన్ని..
కవి కలం పడేటి ప్రసవ వేదనని..
భావం అంతర్వాహినిగా.. అక్షర ఆలాపనల త్రివేణీ సంగమాన్ని..
పక్షినై వినీలాకాశంలో చేస్తున్న ప్రదక్షిణాన్ని..
అక్షుబంధిత ధర్మ దేవతకు ప్రత్యక్ష సాక్షిని.. నే నక్షరాన్ని.
ఇప్పుడు నే లక్ష కోణాలతో క్షుద్ర సమాజపు పాప ప్రక్షాళనకై నడుం
కట్టిన వజ్ర దీక్షను..
అనుమానపు అర్థ విజ్ఞానం కాదు నే కోరేది..
పునఃపరీక్షతో పరిణతి చెందే పరిపూర్ణ జ్ఞానం.
హెచ్చు తగ్గులకై ప్రతిపాదించిన సాపేక్ష సిద్ధాంతాలు కాదు
కావాల్సింది ..
ప్రేమ పూరిత గురుకులం పొందుపరచిన తడిఆరని అక్షరాల
ఆపేక్ష సిద్ధాంతాలు..

ఆధునికత పేర వదిలేసే

పద కాలుష్యాన్ని కారాదు..  పది మందిని తన పరిమళంతో

పరామర్శించే పవిత్ర పుష్పాన్ని కావాలి..

నే కోరేది నిరక్షర కుక్షి మస్తిష్కంలోకి నా మహా ప్రస్థానం

నే కోరేది సుషుప్తావస్థలో ఉన్న సమాజపు చైతన్యం.

నేనంటే అంతరిక్షప్రయోగం కాదు..

అత్యున్నత న్యాయస్థానపు నిర్వచనం కాదు..

బుగ్గైన పసి మొగ్గల జీవితాలు కాదు..

నేనంటే ..

ఒక అద్భుతానికి ఆశ్చర్యం

ఒక విజయానికి ఆనందం

ఒక బీభత్సానికి అశ్రుతర్పణం .


నా కోరిక మానవతా ఉషోదయాన్ని తట్టిలేపే చైతన్య స్ఫూర్తిని,

లోక రక్షని.. కావాలని.   ఆ లక్ష్యం తీరే వరకు ..

ఒక అద్భుత రాగోద్భవార్థం. . కత్తి గాటుకు గురయ్యే  మురళిలా..

ఆ కృష్ణుని రాకకై  విరహోత్కంఠిత రాధికనై ..

ఎదురు చూస్తూనే ఉంటా..



బోయవాని బాణానికి బలయ్యే

పక్షులెన్ని ఉన్నా..

మరో వాల్మీకి జననం కోసం

క్రౌంచ హనన సందర్భ సంజనిత

శోకమే ..శ్లోకమయ్యే వేళ

పెంటి పక్షినై

నిరీక్షిస్తూనే ఉంటా ..

తలవాలిన తడవ తడవకూ తలకట్టై  లేస్తునే ఉంటా..

నాది చెరగని రాత..  నేను చెదరని గీత..నేనక్షరాన్ని

(విష్ణు చైతన్యకి :

అన్నాయ్! ఈ తెలుగువెలుగు అక్షరాన్ని..  తెలుగువాచకాలలో

చూడకపోతామా..  ఈ అక్షరమాల మన మమకారాన్ని లోకాన

గుబాళించక పోతుందా !!.. )

# చివరి పేజీ

మనస్సాక్షి చెప్పినట్టు పేజీ చివర సంతకం చేసే
క్షణమొకటి వేచి ఉంటుంది.
పూజానంతరం నైవేద్యం సమర్పించేటందుకైనా
దొయిల్ని చల్లార్చే ఘడియొకటి ఉంటుంది
భక్తి ప్రపత్తుల గాఢత ఎంతున్నా..
పూజ ముగించే పర్వమొకటి ఉంటుంది
అప్పుడు బాధ్యతల నుండి విముక్తి చెందినట్టుగా
జీవితాన్ని ప్రసాదంలా అందించే అవకాశం
తెల్లకాగితపు విస్తరిలో అక్షరాల వడ్డనతో పూర్తవుతుంది
ధ్వజానికి అవతల అంచునే జెండా రెపరెపలాడుతున్నట్టు
ఏ రచనైనా ప్రారంభం కన్నా ముగింపే బాగుంటుంది
క్రమ క్షీణోపాంత ప్రయోజన సిద్ధాంతం  వర్తించని
ఏమాటైనా మనం పంచుకునే కవితే అవుతుంది
తాడొదిలిన బొంగరంలా నా  అక్షరాలు
మీ మనో ఫలకం పై రింగులు తిరుగుతాయి
ఈ పాటికే నచ్చినవి పాలపొంగై ఆలోచనాగ్నికి
స్వాహాయమానమై ఉండిఉంటాయి

అనుభవాల ఆవిరి చాలక అతకని అక్షరాలు కొన్ని
భాష్పోత్సేక మవ్వలేక నీరుగారిపోయుంటాయి.
అయినా పర్వాలేదు.. అక్షరాలు అంతర్ధానమై..
అంతర్యామిగా మారే అనుభూతిని కాగితాన ఇంకిన
ఒక్క ఇంకుచుక్క ఇవ్వగలిగితే చాలు
ఈ సాహిత్యం మీ ఉన్నతిని కోరే సంస్కారమని గుర్తిస్తే చాలు
ఆశ నిరాశల వెలుగునీడల్లో.. చిన్నదైనా పెద్దదైనా
ఎప్పటికీ నిలచిఉండే ఓ తారలా ఉత్సాహంతో ఒక్క మాట
పునరుత్పన్నం అయితే చాలు
పేజీలు పూర్తైన తర్వాతైనా కలం నాటిన విత్తులు మొలకెత్తి
సహస్రదళాలతో వెలుగురేఖలను పొదివిపట్టితే చాలు
అక్షరాల మధ్య తెల్లకాగితం తొంగిచూసినప్పుడల్లా
నా ప్రయత్నాన్ని కొనసాగించే మరో యశస్వి
మిణుగురై వెలిగి, మనల్ని; కలల్ని ఎగిరేస్తే చాలు
జీవితాలను ఇగిర్చి ఘుమఘుమలాడిస్తే మేలు
అక్షరజ్యోతుల్ని వెలిగించిన తెల్లకాగితానికి  మనసారా
జ్యోతలు అర్పిస్తే .. అదే పదివేలు